

# తీన్మార్

నేటి వాస్తవాలు ...

తెలుగు దిన పత్రిక


తీన్మార్ మెల్కోల్పు
చట్టం & న్యాయం లపై.....
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తలపెట్టిన మెల్కోల్పు కార్యక్రమంలో
భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు
రచనలు, కవితలు & వ్యాసాలు
-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-
teenmaardesk@gmail.com



ములుగు సంపుటి: 04 సంచిక: 260 పేజీలు : 8 శుక్రవారం 27 మార్చి 2026 వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad






## రైతు భరోసా నిధులపై
# రైతుల ఆందోళన



### సంక్షేమ నిధులను ప్రొటెక్టెడ్ అమౌంట్‌గా గుర్తించాలి

### తెలంగాణ రైతుల డిమాండ్

### చట్టపరమైన రక్షణ అవసరం




**తెలంగాణ బ్యూరో, మార్చి 26 (తీన్మార్ న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతుండగా, బ్యాంకర్ల చర్యలు అన్నదాతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఖాతాల్లో డబ్బులు జమ అయిన వెంటనే వాటిని హోల్డ్‌లో పెట్టి జీరో బ్యాలెన్స్ చూపించడం వల్ల రైతులు గందరగోళానికి గురవుతున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఖాతాలను నిలిపివేయడం - మిగతా2లో

## రియల్ మాఫియా
# మాయాజాలం

### ఒకే ప్లాట్.. ఇద్దరికి అమ్మకం

### సబ్ రిజిస్ట్రార్ అండతో రూ. 15 కోట్ల భూ దోపిడీ

### కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు




**హైదరాబాద్, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగంలో మోసాలు విపరీతంగా జరుగుతున్నాయి. సామాన్య జనాలు మాత్రమే కాదు.. కోట్ల రూపాయల బిజినెస్ చేస్తున్న వారు సైతం రియల్ మాయాజాలం బారిన పడుతున్నారు. ఆర్థిక లావాదేవీలతో రియల్ చీటర్ల బారిన పడి దిక్కుతోచని స్థితిలో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడు తాజాగా హైదరాబాద్ లో మరో రియల్ ఎస్టేట్ మోసం వెలుగు చూసింది. ఏకంగా సబ్ రిజిస్ట్రార్ సాయంతో రియల్ చీటింగ్ దిగారు కొంత మంది కేటుగాళ్లు. భూ యజమాని, బిల్డర్, మరికొంత మందితో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కుమ్మక్కై రూ.15 కోట్ల మోసానికి పాల్పడ్డారంటూ బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్‌కు చెందిన వ్యాపారవేత్తలు మోతూరి శ్రీనివాస్ ప్రసాద్, మోతూరి సూర్యకమల్ ప్రసాద్, షో టైమ్ డాట్‌కామ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు కలిసి - మిగతా2లో

## యుద్ధ మేఘాల వేళ
# ప్రధాని అప్రమత్తం

ఇంధన నిల్వలపై సీఎంలతో అత్యున్నత స్థాయి భేటీ

పశ్చిమ ఆసియా పరిణామాలపై సమీక్ష



# వందే భారత్‌లో పురుగుల పెరుగు



### ఐఆర్సీటీసీకి 10 లక్షల భారీ జరిమానా

### కాంట్రాక్టర్పై 50 లక్షల పెనాల్టీ

**న్యూ ఢిల్లీ, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**

పాట్నా–టాటానగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుడికి వడ్డించిన పెరుగులో పురుగులు కనిపించడం సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన రైల్వే మంత్రిత్వ శాఖ ఐఆర్సీటీసీకి భారీ జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే మార్చి 15న పాట్నా నుంచి టాటానగర్ వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో రితేష్ కుమార్ సింగ్ అనే ప్రయాణికుడికి పెరుగు వడ్డించారు. ఆ పెరుగులో పురుగులు పాకుతుండటాన్ని ఆయన గమనించి వీడియో తీశారు. అయితే, ఆ వీడియోను బాధితుడు సోషల్ మీడియాలో పోస్ట్ - మిగతా2లో

# అసెంబ్లీలో జీఎస్టీ సవరణ బిల్లు ఆమోదం

### పన్నుల శాఖలో పోస్టుల హోదాల మార్పు


### పన్నుల వసూళ్లలో మరింత పారదర్శకత



**హైదరాబాద్, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**

జీఎస్టీ సవరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ అమోదం తెలిపింది. గురువారం సభలో చర్చ జరిగిన అనంతరం జీఎస్టీ సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది. సేల్స్ టాక్స్ కమిషనర్ పోస్టును చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్‌గా మార్పు చేశారు. అలాగే అదనపు కమిషనర్ (గ్రేడ్–1) పోస్టును స్టేట్ టాక్స్ కమిషనర్‌గా - మిగతా2లో

## ఎంఎంటీఎస్‌కు
# పూర్వవైభవం



- ప్రయాణికుల సంఖ్య పెంపుపై సీఎం సీరియస్
- ఆఫీస్ వేళల్లో మరిన్ని రైళ్లు
- స్టేషన్ల వద్దకు మినీ బస్సులు



# రైతు భరోసా నిధులపై "రైతుల ఆందోళన"

-మొదటిపేజీ తరువాయి

రైతుల్లో అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిన నేపథ్యంలో, తమ ఖాతాలు హ్యాకింగ్‌కు గురయ్యాయేమోనని భయంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ పరిస్థితుల్లో తమ ఖాతాలను హోల్డ్ లో పెట్టింది బ్యాంకర్లా.. హ్యాకర్లా.. సైబర్ నేరగాళ్ల అన్న సందేహం రైతుల్లో బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా ప్రజల డిపాజిట్లను భద్రంగా నిర్వహించడం, అవసరమైనప్పుడు లావాదేవీలు సజావుగా జరిగేలా చూడడం, రుణాల వసూలు విషయంలో పారదర్శక విధానాలు పాటించడం వంటి బాధ్యతలు బ్యాంకులు నిర్వర్తించాలి. ముఖ్యంగా ప్రభుత్వం జమ చేసే సంక్షేమ నిధులను లబ్ధిదారులు నిరభ్యంతరంగా వినియోగించుకునేలా చూడటం కూడా బ్యాంకుల నైతిక బాధ్యతగా భావించబడుతోంది. అయితే వాస్తవ పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. బ్యాంకులు మొండిబకాయిల పేరుతో ఖాతాలను హోల్డ్‌లో పెట్టి, అందులో గతంలో తాము జమ చేసిన డబ్బులు, ఇతరత్రా తమ ఖాతాలలో జమ అయిన డబ్బులను, ఇటీవల జమ అయిన రైతుబంధు నిధులను కూడా వినియోగించుకోనీయకుండా అడ్డుకుంటున్నాయి. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, అకస్మాత్తుగా ఖాతాలను నిలిపివేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు మాత్రం తమకు కొంత గడువు ఇస్తే బకాయిలను వడ్డీతో సహా చెల్లిస్తామని, కనీసం ప్రభుత్వం జమ చేసిన నిధులను వినియోగించుకునే అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. అయినా వారి వినతులు ఏమాత్రం పట్టించుకోని బ్యాంకర్ల కఠిన వైఖరి కారణంగా రైతులు ఆందోళనలకు గురికావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో ఈ సమస్య రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. బ్యాంకర్ల చర్యల వల్ల తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శాసనసభ, విధాన సభల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. రైతు భరోసా నిధులపై బ్యాంకులు హోల్డ్‌లు విధించకుండా నిరోధించేలా స్పష్టమైన చట్టం తీసుకురావాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. అందుకు చట్టపరమైన మార్పులే పరిష్కారమని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. సంక్షేమ పథకాల నిధులను "ప్రొటెక్టెడ్ అమౌంట్"గా గుర్తించి, ఖాతాలను హోల్డ్‌లో పెట్టే ముందు తప్పనిసరిగా నోటీసులు ఇవ్వాలని, గడువు ఇవ్వకుండా నిధులను నిలిపివేయడాన్ని నిషేధించాలని, బ్యాంకర్ల విచక్షణాధికారాలకు స్పష్టమైన పరిమితులు విధించాలని రైతుల కోరుతున్నారు. ఈ విధంగా చట్టపరమైన మార్పులు తీసుకురాకపోతే, రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రైతు భరోసా నిధులు రైతుల అవసరాల కోసం సమయానికి వినియోగం కావాలంటే, బ్యాంకుల ఇష్టారాజ్యానికి చెక్ పెట్టేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నదాతలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. లేదంటే బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బకాయిల పాపం మీది

## చెల్లింపుల పుణ్యం మాది

**అసెంబ్లీ సాక్షిగా ఆరోగ్య యుద్ధం**

**హరీశ్ రావు విమర్శలకు సీఎం రేవంత్ కౌంటర్**



హైదరాబాద్, మార్చి 26 (తీన్మార్ న్యూస్):

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన గురువారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాస్పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు రేవంత్. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని చెప్పారు రేవంత్ రెడ్డి. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్–1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకువస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల మెనూలో మార్పు

**చికెన్ స్థానంలో ఇక చేపల వడ్డన**

**ఆర్థిక ఇబ్బందులున్నా వెనకడుగు వేయము**

**మంత్రి వాకిటి శ్రీహరి**

హైదరాబాద్, మార్చి 26 (తీన్మార్ న్యూస్):



తెలంగాణా రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్రంలో జరుగుతున్న అనేక కార్యక్రమాలు, అమలవుతున్న పథకాలపై శాసనసభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. రాష్ట్రంలో పాలనపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి శుభవార్త చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద అందించే ఆహారంలో ఇకపైన చికెన్ కు బదులుగా వారానికి ఒకరోజు చేపలు అందించనున్నట్టు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన ఆయన మధ్యాహ్న భోజన పథకం గురించి కీలక విషయాలను వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద పోషకాహారం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిపైన ప్రత్యేకంగా దృష్టి సారించారని పేర్కొన్నారు. పిల్లలకు ఎటువంటి ఆటంకం లేకుండా కడుపునిండా పౌష్టికాహారం లభించేలా చూసేందుకు ప్రభుత్వం వైపు నుంచి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో చికెన్ కు బదులు వారానికి ఒకరోజు చేపలు అందించాలనే ఆలోచన ఉన్నట్టు గతంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమీక్షలో కూడా ఆయన వెల్లడించారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పోయినప్పటికీ పేదల సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు చర్యల అధికారులు కృషి చేయాలని సూచించారు. వారానికి ఒకసారి హాస్టల్స్ ను తనిఖీ చేస్తున్నట్టు, ఏదైనా లోపం ఉంటే హాస్టల్ ఇన్చార్జ్ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రతివారం విద్యార్థులకు పౌష్టికాహారంగా మధ్యాహ్న భోజనంలో చేపలు అందిస్తామని చెప్పిన మంత్రి వాకిటి శ్రీహరి రాష్ట్రంలో బలమైన పశుసంపద ఉందన్నారు. గుడ్ల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో చేపల ఉత్పత్తికి కూడా మత్స్యకారులకు తగిన సహాయం చేస్తున్నామన్నారు. వారంలో ఒకరోజు చేపలను విద్యార్థులకు పెట్టడం ద్వారా మత్యకారులను కూడా ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు.

## భద్రాద్రి అభివృద్ధికి రూ. 586 కోట్లు

**మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిన సర్కార్**

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల**

తెలంగాణ బ్యూరో, మార్చి 26 (తీన్మార్ న్యూస్):



శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు తెలంగాణ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మొత్తం రూ.586 కోట్లతో రామాలయంతో పాటు భద్రాచలం పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని మిథిలా కళ్యాణ మండపం వేదికగా స్వామివారి కళ్యాణం జరుగుతుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి సమర్పించనున్నారని తెలిపారు. అందుకు శుక్రవారం భద్రాచలానికి సీఎం రేవంత్ వస్తున్నారన్నారు. ఆయనకు ప్రజల తరపున ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, ఎయిర్ పోర్టు ఏర్పాటు దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ ఏర్పాటుకు అవకాశం ఉందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులు చేపట్టినట్లు చెప్పారు. సీతారాముల కళ్యాణం వీక్షించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై దేవాలయం అధికారులు, సిబ్బందికి మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

## అసెంబ్లీలో మైక్ కట్ చేయడంపై

## "హరీశ్ రావు ఆగ్రహం"

**ఆరోగ్యశ్రీ గణాంకాలపై ప్రభుత్వానికి సవాల్**

హైదరాబాద్, మార్చి 26 (తీన్మార్ న్యూస్):



రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేందుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి తీసుకురాకుండా ప్రభుత్వం అడ్డుపడుతోందన్నారు. హరీశ్ రావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.32 కోట్లు ఖర్చయ్యేవి. 2023 నాటికి ఇది రూ.68 కోట్లకు చేరుకుంది. కానీ ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది. జనాభా పెరుగుదల, వైద్య ఖర్చుల పెరుగుదల దృష్ట్యా ఈ పెంపు సహజం, ఇందులో కాంగ్రెస్ కొత్తగా సాధించిన ఘనతేమీ లేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, పనులు చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ ఆస్పత్రులన్నీ పూర్తై ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మరింత అండగా నిలవాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్సైజ్ అదాయంలో వాటాను పెంచి నిధులను సమకూర్చింది అని అన్నారు.

## అసెంబ్లీ నుంచి ఆట మైదానానికి

**ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల మధ్య క్రీడా సమరం**

**ఈ నెల 29, 30 తేదీల్లో గచ్చిబౌలిలో పోటీలు**

**రాజకీయ ఒత్తిడి నుంచి విరామం**

తెలంగాణ బ్యూరో, మార్చి 26 (తీన్మార్ న్యూస్):



తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సభ్యుల (ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) కోసం ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగుతాయి. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, టెన్నిస్ వంటి క్రీడలతో పాటు అథ్లెటిక్స్ విభాగంలోనూ పోటీలు ఉండనున్నాయి. కాగా, నిరంతరం ప్రజా సమస్యలు, రాజకీయాలతో బిజీగా ఉండే ప్రజాప్రతినిధులకు మానసిక ఉల్లాసాన్ని అందించడంతో పాటు, వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఉన్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రస్తుత శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరగనున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులందరూ ఈ క్రీడల్లో పాల్గొననున్నారు. క్రీడాకారులకు కావాల్సిన కిట్లు, ట్రాక్ సూట్లు, వైద్య సదుపాయాలను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు.

## వందే భారత్‌లో పురుగుల పెరుగు

-మొదటిపేజీ తరువాయి

చేయడంతో అది కాస్త వైరల్ అయ్యింది. రైల్వే అధికారులు వచ్చి తనిఖీ చేసినప్పుడు కూడా పురుగులు స్పష్టంగా కనిపించాయి. అక్కడి సిబ్బంది అవి పురుగులు కావని, కేసరి అని కవర్ చేసే ప్రయత్నం చేయడంపై నెటిజన్లు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో నిరసనలు వెల్లువెత్తడంతో రైల్వే శాఖ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఐఆర్సీటీసీ కి రూ. 10 లక్షల జరిమానా విధించింది. అదేవిధంగా సదరు ఆహార సేవల విభాగంపై రూ.50 లక్షల జరిమానా విధిస్తూ, వారి కాంట్రాక్టును రద్దు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## రియల్ మాఫియా మాయాజాలం

-మొదటిపేజీ తరువాయి

పోలీసులకు ఈ ఫిర్యాదు చేశారు. కుత్బుల్లాపూర్ మండలంలోని నిజాంపేట్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 326/పీ లో నిడమర్తి శివప్రసాద్‌కు 3 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో ఉన్నతి బిల్డ్‌టెక్ సంస్థ తరపున నిర్మాణాలు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధి నవీన్‌కుమార్ గోయల్ ముందుకు వచ్చారు. ఈ మేరకు భూ యజమానికి 34 శాతం.. బిల్డర్‌కు 66 శాతం ఒప్పందంతో 2016లో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కమ్ జీపీ చేసుకున్నారు. ఈ మేరకు 2021లో హెచ్ఎండీఏ నుంచి 3 సెల్లార్లు, గ్రౌండ్, 23 అంతస్తులకు అనుమతి తెచ్చుకొని శ్రీ రథ్ అపార్టుమెంట్స్ పేరుతో నిర్మాణాలు చేపట్టారు. అనుమతులు రాక ముందే భూ యజమాని, బిల్డర్ సహకారంతో ఐదుగురికి విక్రయాలు చేశారు. శ్రీనివాస్ ప్రసాద్, సూర్యకమల్, షోటైమ్ డాట్‌కామ్ కంపెనీలు 97, 350 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఫ్లాట్లను రూ. 15.26 కోట్లకుపైగా వెచ్చించి కొనుగోలు చేశారు. ఈ విక్రయాలను దాచిపెట్టిన భూ యజమాని, బిల్డర్, బిల్డర్‌కు సంబంధించిన నరేంద్రకుమార్ మోడీ, శశికాంత్ మోడీ.. ఇతరులకు విక్రయించారు. మొదట విక్రయించిన విషయాన్ని దాచిపెట్టి 2023లో ఒక సప్లమెంటరీ డీడ్‌ను నమోదు చేశారు. దీనికి అప్పటి కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ పూర్తి సహకారం అందించారని బాధితులు తెలిపారు. ప్రణాళిక ప్రకారం మొదట విక్రయాలను దాచిపెట్టి.. సబ్ రిజిస్ట్రార్ సహకారంతో అమ్మిన ఫ్లాట్లనే తిరిగి ఒక్కో ఫ్లాట్‌ను రూ. 22 లక్షల నుంచి రూ. 33 లక్షల ధరతో తెలంగాణ, ఏపీ, ఢిల్లీ, హర్యాన రాష్ట్రాలకు చెందిన అమాయకులకు విక్రయిస్తున్నారని బాధితులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు పోలీసులు భూ యజమాని, బిల్డర్ అతనికి సహకరించిన వారితో పాటు కుత్బుల్లాపూర్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎంఎంటీఎస్‌కు పూర్వవైభవం

హైదరాబాద్, మార్చి 26 (తీన్మార్ న్యూస్):

హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ఏటికేడు ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమంతప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని సీఎం తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు.. వసతులు మెరుగుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ వికాస్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హెచ్‌యూ ఎంటీఏ ఎండీ జీవన్ బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ పాల్గొన్నారు.

## యుద్ధ మేఘాల వేళ ప్రధాని అప్రమత్తం

న్యూ ఢిల్లీ, మార్చి 26 (తీన్మార్ న్యూస్):

పశ్చిమ ఆసియాలో ఇజ్రాయెల్/అమెరికా – ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ యుద్ధ మేఘాల ప్రభావం ప్రపంచ దేశాలతో పాటు భారత్‌పై కూడా పడే అవకాశం ఉండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ మరియు వంటగ్యాస్ సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగారు. పశ్చిమ ఆసియా పరిణామాలపై చర్చించేందుకు ప్రధాని మోడీ నేడు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ భేటీలో పలు అంశాలపై చర్చించనున్నారు.

**రాష్ట్రాలకు ఆదేశాలు**

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల పెరుగుదల మరియు దేశీయంగా పెట్రోల్, డీజిల్ నిల్వలపై సమీక్షించనున్నారు. ఇంధన కొరత ఉందంటూ వస్తున్న పుకార్లను అడ్డుకోవడం, ప్రజల్లో భయాందోళనలు కలగకుండా చూడాలని ఆదేశాలివ్వనున్నారు. రాష్ట్రాల వారీగా గ్యాస్ మరియు పెట్రోల్ సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించనున్నారు. యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల నుండి చమురు రవాణాకు ఆటంకం ఏర్పడటంతో భారత్‌లో గ్యాస్, పెట్రోల్ కష్టాలు మొదలయ్యే అవకాశం ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై కేంద్ర పెట్రోలియం శాఖ ఇప్పటికే స్పందించింది. భారత్‌లో ప్రస్తుతం 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. యుద్ధం వల్ల సముద్ర మార్గాల్లో రవాణా ఇబ్బందులు ఎదురైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా చమురు దిగుమతి చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. చమురు నిల్వలను బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పెట్రోల్ బంకుల వద్ద భారీ క్యూలు లేకుండా పర్యవేక్షించాలని ఇప్పటికే కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. నేటి సమావేశం తర్వాత ఇంధన వినియోగం మరియు ధరల నియంత్రణపై కేంద్రం మరిన్ని కీలక మార్గదర్శకాలు విడుదల చేసే అవకాశం ఉంది.

## అసెంబ్లీలో జీఎస్టీ

## సవరణ బిల్లు ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

మార్చుతూ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చింది. ఒకే దేశం, ఒకే చట్టం నినాదంతో జీఎస్టీ చట్టాన్ని చేసినప్పటికీ కేంద్రం, రాష్ట్రంలోని శాఖాధిపతుల మధ్య హోదాలో తేడాలు ఉండటం వల్ల వీటన్నింటిని యూనిఫామ్ చేసేందుకు ఈ చట్ట సవరణ చేస్తున్నామని సభలో ప్రభుత్వం వెల్లడించింది.

**రాష్ట్రానికి నష్టమేమి లేదు:**

జీఎస్టీ చట్టం లక్ష్యం నెరవేర్చేందుకు అవసరమైన కమ్యూనికేషన్, కో ఆర్డినేషన్ కోసం సులభతరం కావాలని అందుకనే మిగతా రాష్ట్రాల్లో మాదిరిగా సేల్స్ టాక్స్ కమిషనర్ పోస్టును చీఫ్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్‌గా, అదనపు కమిషనర్ (గ్రేడ్–1) పోస్టు స్టేట్ టాక్స్ కమిషనర్‌గా మార్చుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ బిల్లు ద్వారా ఆర్థిక పరమైన అంశాలేమి లేవని, ఉద్యోగాలు తగ్గవని ఈ బిల్లుపై చర్చ సందర్భంగా సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సవరణ ద్వారా రాష్ట్రానికి వచ్చే నష్టమేమి లేదని తెలిపారు. అనంతరం సభ ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది.

# రహస్య పొత్తులు- రాజకీయ ఎత్తులు




అసెంబ్లీ ఎన్నికల వేళ కేరళలో పొలిటికల్ హీట్ పెరిగిపోయింది. మూడు విమర్శలు, ఆరు ఆరోపణలు అన్నట్టుగా రాజకీయ పార్టీలు పరస్పరం తలపడుతున్నాయి. అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్(ఎల్‌డీఎఫ్), విపక్ష యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), బీజేపీ మధ్య త్రిముఖ పోరు జరుగుతోంది. రహస్య పొత్తులు, ఓట్ల చీలిక, క్రాస్ ఓటింగ్ గురించి అన్ని పార్టీల నేతల మధ్య వాగ్యుద్ధం జరుగుతోంది. ఇక ఇదే సమయంలో అత్యంత జనాకర్షక ఎన్నికల మేనిఫెస్టోల తయారీకి రాజకీయ పక్షాలు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. అందువల్లే ఇప్పటిదాకా మేనిఫెస్టోలను విడుదల చేయలేదని తెలుస్తోంది.

**సీపీఎం సీజేపీగా మారిపోయింది : రాహుల్**

తాజాగా కేరళ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన సంచలన వ్యాఖ్యలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమిని బలహీనపర్చేందుకు సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ కూటమి, బీజేపీతో రహస్య డీల్‌ను కుదుర్చుకుందని రాహుల్ ఆరోపించారు. ఇప్పుడు సీపీఎం పార్టీ కాస్తా కమ్యూనిస్ట్ జనతా పార్టీ (సీజేపీ)గా మారిపోయిందని ఆయన విమర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే కాపాడుతున్నారని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కూడా కేరళ వేదికగా ఈ వ్యాఖ్యలనే చేశారు.

**క్రాస్ ఓటింగ్‌కు సీపీఎం, బీజేపీ కసరత్తు**

రాహుల్ గాంధీ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు కే మురళీధరన్, వీడీ సతీశన్ సమర్థించారు. త్రిస్సూర్, వడకర వంటి కీలకమైన అసెంబ్లీ స్థానాలలో సీపీఎం, బీజేపీల మధ్య క్రాస్ ఓటింగ్ జరిగేందుకు క్షేత్రస్థాయిలో వ్యూహాత్మక ఏర్పాట్లను చేస్తున్నారని వారు ఆరోపించారు. కాసరగోడ్, మంజేశ్వరం, పాలక్కడ్, రణ్ని, కొణ్ని వంటి అసెంబ్లీ స్థానాల్లోనూ ఇదే విధమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్, యూడీఎఫ్ కూటమి అభ్యర్థులను ఓడించేందుకు బీజేపీ, సీపీఎం కుమ్మక్కు అయ్యాయని కే మురళీధరన్, వీడీ సతీశన్ ధ్వజమెత్తారు.

**మైనారిటీ ఓట్లను చీల్చేందుకు సీపీఎం ప్లాన్**

కేరళలోని ఎల్‌డీఎఫ్ కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని కాంగ్రెస్, యూడీఎఫ్ కూటమిలోని ఇతర పార్టీలు విమర్శిస్తున్నాయి. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన ఎల్‌డీఎఫ్‌కు మరోసారి ప్రజలు ఛాన్స్ ఇవ్వరని ఆ పార్టీలు అంటున్నాయి. కేరళ అసెంబ్లీలో 140 సీట్లు ఉండగా, ఈసారి యూడీఎఫ్ కూటమికి 100కుపైగా సీట్లు వస్తాయని యూడీఎఫ్ వర్గాలు విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాయి. అయితే యూడీఎఫ్‌కు కీలకమైన మైనారిటీ ఓట్లను చీల్చి, పరోక్షంగా బీజేపీ అభ్యర్థులకు సహాయపడేందుకే సీపీఎం కుట్ర చేస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇందుకోసమే కొన్ని అసెంబ్లీ స్థానాల్లో ఉద్దేశపూర్వకంగానే స్వతంత్ర అభ్యర్థులను సీపీఎం బరిలోకి దింపిందని వారు అంటున్నారు.

**కాంగ్రెస్-ముస్లిం లీగ్-బీజేపీ కలిసి పనిచేస్తాయ్ : సీఎం విజయన్**

యూడీఎఫ్ కూటమి, కాంగ్రెస్ ఆరోపణలను సీఎం పినరయి విజయన్ ఒక బహిరంగ సభ వేదికగా ఖండించారు. అవన్నీ నిరాధారమైన రాజకీయ ప్రేరేపిత ఆరోపణలు అని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో తన సమావేశం పూర్తిగా పరిపాలనాపరమైందని తేల్చి చెప్పారు. కాంగ్రెస్-ముస్లిం లీగ్-బీజేపీ ఈ ఎన్నికల్లో కలిసి పనిచేసే అవకాశాలు ఉన్నాయని విజయన్ కౌంటర్ ఇచ్చారు. సీపీఎంను అడ్డుకునేందుకు ఆ మూడు పార్టీలు ఎంతకైనా తెగిస్తాయని మండిపడ్డారు. గతంలోనూ రహస్యంగా కాంగ్రెస్-ముస్లిం లీగ్-బీజేపీ కలిసి పనిచేశాయని ఆరోపించారు. కాంగ్రెస్, యూడీఎఫ్ కూటమి ఓటమి భయంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని సీపీఎం నేత, మాజీ ఆర్థిక మంత్రి టి.ఎం.థామస్ ఐజాక్ తెలిపారు. మళ్లీ ఎల్‌డీఎఫ్ కూటమి గెలుపు ఖాయమన్నారు.

**నాడు బీఆర్ఎస్‌పై నేడు ఎల్‌డీఎఫ్‌పై బీ టీమ్ ముద్ర : బీజేపీ**

మైనారిటీల ఓట్లను ఏకీకృతం చేయడానికి యూడీఎఫ్ కూటమి, ఎల్‌డీఎఫ్ కూటమి యత్నిస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. ఆ రెండు కూటములు రాజకీయ ప్రేరేపిత ఉద్దేశంతో తప్పుడు ఆరోపణలను చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆ ఆరోపణల్లో అస్సలు వాస్తవాలు లేవన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్, సీపీఎం పార్టీల మధ్య పొత్తులు కుదిరిన విషయం అందరికీ తెలుసని రాజీవ్ చంద్రశేఖర్ చెప్పారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి బీ టీమ్‌గా కాంగ్రెస్ చిత్రీకరించిందన్నారు. ఇప్పుడు కేరళలోని ఎల్‌డీఎఫ్ కూటమిని కూడా అదే విధంగా కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా చేసుకుంటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అమలుచేసిన ఎన్నికల వ్యూహాన్నే కేరళలోనూ వర్తింపజేసే యత్నాల్లో హస్తం పార్టీ ఉందన్నారు.

**సీపీఎం, బీజేపీ మధ్య అవగాహన కుదిరి ఉండొచ్చు, కానీ**

"కేరళలోని కొన్ని అసెంబ్లీ స్థానాల్లో రాజకీయ పార్టీల మధ్య అవగాహనలు కుదిరినా కుదరొచ్చు. స్థానిక పరిస్థితులను బట్టి, అభ్యర్థులను బట్టి అందుకు అవకాశాలు ఉంటాయి. ఈక్రమంలోనే కొన్ని స్థానాల్లో సీపీఎం, బీజేపీ మధ్య అవగాహన కుదిరి ఉండొచ్చు. కానీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానాల్లో క్షేత్రస్థాయిలో ఇదే ఫార్ములాను అమలు చేయడం ఇప్పటికిప్పుడు సాధ్యపడదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ కూటమిపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు యూడీఎఫ్, బీజేపీ సర్వశక్తులను ఒడ్డుతున్నాయి. దీంతో ఈ ఎన్నికల్లో హోరాహోరీ పోరు జరుగుతోంది" అని కాసరగోడ్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్, ఎన్నికల విశ్లేషకుడు డాక్టర్ జి.గోపకుమార్ పేర్కొన్నారు.

**ఎన్నికల మేనిఫెస్టోలపైనే పూర్తి ఫోకస్**

మరోవైపు అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల తయారీపై పూర్తి ఫోకస్ పెట్టాయి. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించే హామీలతో జనరంజక మేనిఫెస్టోలను విడుదల చేయాలనే పట్టుదలతో పార్టీలు ఉన్నాయి. అందుకే ఇప్పటిదాకా మేనిఫెస్టోలను విడుదల చేయలేదని తెలుస్తోంది. పార్టీ శ్రేణులు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, ఉద్యోగ సంఘాల నుంచి సేకరించిన సలహాలు, సూచనల ప్రాతిపదికన మేనిఫెస్టోల తయారీకి కసరత్తు జరుగుతోంది.

# మహిళా కోటాలో సవరణలకు అంత తొందరెందుకు?

మహిళా రిజర్వేషన్ కోటా (నారీ శక్తి వందన్ అధినియం) చట్టంలో సవరణలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకంత తొందరపడుతోందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక దీనిపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈమేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజుకు ఖర్గే గురువారం ఒక లేఖ శారు. నారీ శక్తి వందన్ అధినియం చట్టంలో చేయనున్న సవరణలపై చర్చించేందుకు సమావేశం కావాలని కోరుతూ ప్రభుత్వం పంపిన లేఖ తనకు గురువారమే (మార్చి 26) అందిందని ఖర్గే తెలిపారు. దీనిపై కూలంకషమైన చర్చ కోసం ఏప్రిల్ 29 తర్వాత అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించమని సూచిస్తూ మార్చి 24నే విపక్ష పార్టీలు కేంద్రానికి ఒక లేఖను రాశాయని ఆయన గుర్తుచేశారు.

**ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నాం**

"మహిళా రిజర్వేషన్ కోటాకు సంబంధించిన నారీ శక్తి వందన్ అధినియం అనేది ఒక రాజ్యాంగ సవరణ చట్టం. దానిలో మరిన్ని సవరణలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంతగా ఎందుకు తొందరపడుతోందో నాకైతే అర్థం కావడం లేదు. వాస్తవానికి ఈ చట్టానికి 30 నెలల క్రితమే పార్లమెంటు ఆమోదం లభించింది. నారీ శక్తి వందన్ అధినియం చట్టంలోని నిబంధనలు, అమలు ప్రణాళికపై చర్చించేందుకు వీలైనంత త్వరగా అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరుతూ నేను 2026 మార్చి 16నే లేఖను రాశాను. ప్రభుత్వం నచ్చిన తేదీని సూచిస్తే, సమావేశం అవుదామని



ఆనాడు చెప్పాను. ప్రస్తుతానికి విపక్ష పార్టీలన్నీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నాయి. అందుకే ఎన్నికల ప్రచారం ముగిశాక, ఈ అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని మేం కేంద్ర ప్రభుత్వాన్ని కోరాం" అని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే పేర్కొన్నారు.

**నారీ శక్తి చట్టం అమలు తేదీని మార్చకూడదు**

"నారీ శక్తి వందన్ అధినియం చట్టం -2023ను 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి అమల్లోకి తేవాల్సి ఉంది. దానిలో కేంద్ర ప్రభుత్వం చేయాలని భావిస్తున్న మరిన్ని సవరణల వల్ల, చట్టం అమలు తేదీపై ప్రభావం పడకూడదు. 2023 సెప్టెంబరు 21న ఈ చట్టంపై రాజ్యసభలో జరిగిన చర్చలో నేను మాట్లాడాను. వెంటనే ఈ చట్టాన్ని అమల్లోకి తేవాలని డిమాండ్ చేశాను. కానీ కేంద్ర ప్రభుత్వం నా డిమాండ్‌తో ఏకీభవించలేదు" అని ఖర్గే తెలిపారు. ఇక ఖర్గే రాసిన లేఖపై తృణమూల్ కాంగ్రెస్ మినహా పలు విపక్ష పార్టీలు సంతకాలు చేశాయి.

**నియోజకవర్గాల పునర్విభజనకు ముందే అమల్లోకి ?**

నారీ శక్తి వందన్ అధినియం చట్టం -2023లో చేయనున్న సవరణలపై చర్చించేందుకు అఖిలపక్ష భేటీని ఏర్పాటు చేయాలంటూ ఇతర విపక్ష పార్టీలు కూడా కేంద్ర మంత్రి రిజిజుకు లేఖలు రాశాయి. ఆ పార్టీలు కూడా ఏప్రిల్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల తర్వాతే సమావేశాన్ని నిర్వహించాలని కోరాయి. నారీ శక్తి వందన్ అధినియం చట్టం 2023 సెప్టెంబరులో పార్లమెంటు ఆమోదాన్ని పొందింది. దీన్ని అధికారికంగా '106వ రాజ్యాంగ సవరణ చట్టం' అని పిలుస్తారు. దేశంలోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి కావడానికి ముందే ఈ చట్టాన్ని అమల్లోకి తేవాలనే ప్రణాళికతో కేంద్ర ప్రభుత్వం ఉందని తెలుస్తోంది. దీనికోసమే వీలైనంత త్వరగా అందులో మరిన్ని సవరణలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

**15 రోజుల్లోగా రెండు రోజుల ప్రత్యేక సెషన్**

అంతకుముందు బుధవారం రోజు నారీ శక్తి వందన్ అధినియం చట్టంపై కాంగ్రెస్ పార్టీ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాని మోదీ యూటర్న్‌లు తీసుకోవడంలో ఉస్తాద్ అని, నారీ శక్తి చట్టం అమలు విషయంలోనూ ఆయన యూటర్న్ తీసుకోబోతున్నారని విమర్శించింది. నియోజకవర్గాల పునర్విభజన, జనగణన ప్రక్రియలు పూర్తి కాకముందే ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చే ప్లాన్‌లో మోదీ సర్కారు ఉందని పేర్కొంది. వచ్చే 15 రోజుల్లోగా రెండు రోజుల ప్రత్యేక పార్లమెంటు సెషన్‌ను నిర్వహించి ఈమేరకు నారీశక్తి చట్టానికి సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని కాంగ్రెస్ తెలిపింది.

# పెట్రో వాత షురూ!




మధ్యప్రాచ్యంలో ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు సంక్షోభం ఏర్పడింది. ముడిచమురు ధరలు భారీగా పెరిగాయి. అంతేకాదు పెట్రోలు, డీజిల్ సరఫరాలో అంతరాయాలు వస్తాయనే ఆందోళనతో, వినియోగదారుల ప్యానిక్ కొనుగోళ్లతో దేశంలో పెట్రోలు బంకుల వద్ద రద్దీ ఏర్పడింది. మరోవైపు దేశానికి సరిపడా ఇంధన నిల్వలున్నాయని, ఆందోళన అవసరం లేదని కేంద్రం పదే పదే స్పష్టతనిస్తోంది. ఈ నేపథ్యంలో అతిపెద్ద ఇంధన విక్రయ సంస్థ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం వినియోగదారులకు షాకిచ్చింది. మనీ కంట్రోల్ నివేదిక ప్రకారం భారతదేశపు అతిపెద్ద ప్రైవేట్ ఇంధన విక్రయ సంస్థ నయారా ఎనర్జీ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది, పెట్రోల్‌పై లీటరుకు రూ.5 పెంచింది. అలాగే డీజిల్‌పై లీటరుకు రూ.3 పెంచేసింది. భారతదేశంలోని 1,02,075 పెట్రోల్ పంపులలో 6,967 పంపులను నిర్వహిస్తున్న నయారా ఎనర్జీ, పెరిగిన ముడిసరుకు ఖర్చులలో కొంత భాగాన్ని వినియోగ దారులపై మోపాలని నిర్ణయించింది. ఈ పెంపు నయారా బంకుల్లో మాత్రమే. నేటి నుండి పెరిగిన ధరలు అమలులోకి వస్తాయి. మరోవైపు పెట్రోల్, డీజిల్ అనేవి నియంత్రణ లేని వస్తువులని, వాటి ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు స్వతంత్రంగా నిర్ణయిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. నయారా వంటి ప్రైవేట్ సంస్థలకు అటువంటి రాయితీలు ఉండవు గనుక పెరిగిన ఖర్చుల భారాన్ని వినియోగదారులపై వేయక తప్పలేదని సంస్థ వర్గాలు తెలిపాయి. కాగా ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల తర్వాత అంతర్జాతీయ చమురు ధరలు దాదాపు 50% పెరిగాయి. ఒక దశలో ముడిచమురు ధర బ్యారెల్‌కు 119 డాలర్లకు చేరుకుంది. దేశంలోని 90శాతం మార్కెట్‌ను నియంత్రించే ప్రభుత్వ రంగ సంస్థలు (×రాజ, దీ్రాజూ, న్రాజూ))ఇప్పటికీ సాధారణ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచలేదు.అయితే, గత వారం ఇవి కూడా ప్రీమియం పెట్రోల్ ధరను లీటరుకు రూ.2, పారిశ్రామిక అవసరాల కోసం వాడే బల్క్ డీజిల్ ధరను లీటరుకు సుమారు రూ.22 పెంచాయి.

## రాహుల్ గాంధీకి ప్రాంతీయ నాయకుడికి ఉన్నంత అవగాహన కూడా లేదు

కేరళలో అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతోంది. ఈ క్రమంలో అధికార విపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. తాజాగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్? కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్? గాంధీ జాతీయ నాయకుడు అయినప్పటికీ, లోకల్ లీడర్?కు ఉన్నంత అవగాహన కూడాలేదని విమర్శలు గుప్పించారు. గత అనుభవాల నుంచి నేర్చుకోవడానికి ఆయన సిద్ధంగా లేరని ఎద్దేవా చేశారు. అంతేకాదు, రాహుల్ ఆయన పార్టీ బీజేపీకి బీ టీమ్?గా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కోతమంగళంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ మేరకు వ్యాఖ్యానించారు. "వాస్తవం ఏమిటంటే, రాహుల్ గాంధీ ఓ జాతీయ నాయకుడు. అయినప్పటికీ ప్రాంతీయ నాయకుడికి ఉన్నంత అవగాహన కూడా ఆయనకు లేదు. అంతేకాదు, ఆయన ఏ విషయాన్ని ఆయన లోతుగా తెలుసుకునే ప్రయత్నం చేయరు. ఇలాంటి లక్షణాలు రాజకీయ నాయకుడికి తగవు. కాంగ్రెస్ వంటి పెద్ద పార్టీకి చెందిన ముఖ్య నాయకుడిలో ఇలాంటి దిగజారుడు కనిపించడం ఆశ్చర్యకరం"

**రాహుల్ వ్యాఖ్యలకు గట్టి కౌంటర్ ఇచ్చిన విజయన్**

ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, దేశవ్యాప్తంగా ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేస్తూ కేంద్ర సంస్థలు ఒత్తిడి తెస్తున్నాయని ఆరోపించారు. అయితే, కేరళలో ఉన్న అవినీతి కేసుల్లో పినరయి విజయన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ఎల్‌డీఎఫ్, బీజేపీ మధ్య కుమ్మక్కు ఉన్నదనే అనుమానాలకు దారితీస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు పినరయి విజయన్ గట్టి కౌంటర్ ఇచ్చారు.

**'కేజ్రీవాల్ విడుదల కాంగ్రెస్, బీజేపీకి గట్టి దెబ్బ'**

వీటితో పాటు మరిన్ని విషయాల గురించి కూడా ముఖ్యమంత్రి విజయన్? ప్రస్తావించారు. ఈ సందర్భంగా దిల్లీ మద్యం అవినీతి కేసును ఆయన ఉదహరించారు. దిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత అరవింద్ కేజ్రీవాల్?ను అరెస్ట్ చేయాలని కాంగ్రెస్? కోరిందని ఆయన? గుర్తు చేశారు. కానీ, ఆ తర్వాత కేజ్రీవాల్ నిర్దోషిగా విడుదలయ్యారని, అది కాంగ్రెస్, బీజేపీ రెండింటికీ గట్టి దెబ్బ అని విజయన్? వ్యాఖ్యానించారు.

**'కాంగ్రెస్ వల్లే దిల్లీలో బీజేపీ గెలిచింది'**

దిల్లీలో బీజేపీని గద్దె దించడానికి కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీతో కలిసి పనిచేయకుండా వ్యతిరేకంగా పోటీ చేయడం వల్లే బీజేపీ విజయం సాధించిందని విజయన్ ఆరోపించారు. ఇదే పరిస్థితి హరియాణా, బిహార్ రాష్ట్రాల్లో కూడా కనిపించిందని, అక్కడ కూడా కాంగ్రెస్ బీజేపీ వ్యతిరేక కూటమిని బలపరుచుకోలేకపోవడం వల్లే బీజేపీ గెలిచిందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాలన్నింటిని గమనిస్తే బీజేపీ గెలుపునకు కాంగ్రెస్ పార్టీ సహకరిస్తోందని, దాని భాగస్వామిగా వ్యవహరిస్తోందని అభిప్రాయపడ్డారు.

**'కాంగ్రెస్, బీజేపీ రెండింటిది ఒకే విధమైన ఆలోచనా ధోరణి'**

కేరళలో ఎల్‌డీఎఫ్‌ను ఓడించేందుకు దశాబ్దాలుగా బీజేపీతో పొత్తులో ఉన్నది కాంగ్రెసేనని విజయన్? అన్నారు. కేరళలో అధికారం సాధించడం కోసం గతంలో కాంగ్రెస్ ఆర్ఎస్ఎస్?తో, ఆ తర్వాత జనసంఘ్?తో, ఇప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకుంటోందని ?ఆరోపించారు. ఈఎంఎస్ నంబూద్రిపాద్? కాలం నుంచి ఈ విధానం కొనసాగుతోందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ రెండింటికీ ఒకే విధమైన ఆలోచనా ధోరణి ఉందని వ్యాఖ్యానించారు.

**'ఓటమి భయంతో చేస్తున్న ఆరోపణలు ముందస్తు బెయిల్ లాంటివి'**

ఇదిలా ఉండగా, ఇటీవల యూడీఎఫ్ ఎన్నికల కార్యక్రమంలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. సీపీఎం-బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు. అయితే, వాటికి కూడా విజయన్ ఘాటుగా స్పందించారు. వారు చేసిన ఆరోపణలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతో చేస్తున్న ముందస్తు బెయిల్ లాంటివని విమర్శించారు. కాగా, 140 అసెంబ్లీ స్థానాలు ఉన్న కేరళలో ఏప్రిల్ 9న ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. కౌంటింగ్ మే 4న నిర్వహించనున్నట్లు అధికారులు ఇదివరకే పేర్కొన్నారు.

## దౌత్యంలో మోదీ ప్రభుత్వం ఘోర వైఫల్యం



పశ్చిమాసియా యుద్ధంలో మధ్యవర్తిగా పాకిస్థాన్ వ్యవహరిస్తోందనే అంశం ప్రాంతీయ దౌత్యంలో మోదీ ప్రభుత్వ వైఫల్యాన్ని సూచిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ఈవిషయంలో భారత్ తత్తరపాటును కనిపించకుండా కవర్ చేసే ప్రయత్నాన్ని విదేశాంగ మంత్రి జైశంకర్ చేస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు. సీమాంతర ఉగ్రవాదం, అణ్వస్త్ర విస్తరణ, సామాన్య ప్రజలపై దాడులు చేసిన దుష్ట చరిత్ర కలిగిన పాక్ లాంటి దేశాన్ని మధ్యవర్తిత్వ పాత్రకు పరిశీలించడం అత్యంత దారుణమని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. "పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించే చర్చలకు మధ్యవర్తిగా పాకిస్థాన్‌ను పరిగణించడం నిజంగా దారుణం. అది నాలుగు దశాబ్దాలకుపైగా భారతదేశంలో, ఇతర దేశాలలో ఉగ్రవాదాన్ని నడిపించిన దేశం. ఒసామా బిన్ లాడెన్ లాంటి భయంకరమైన ఉగ్రవాదులకు పాక్ ఆశ్రయం ఇచ్చింది. ఇతర దేశాలకు అణ్వస్త్ర టెక్నాలజీని అందించడానికి పాక్‌లోని ఏక్యూ ఖాన్ నెట్‌వర్క్ ప్రయత్నాలు చేసింది. దీని గురించి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. పాక్ మాజీ అధ్యక్షుడు ముషారఫ్ ఈవిషయాన్ని బహిరంగంగానే అంగీకరించారు. ఈవిధంగా అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టాలను పాక్ ఘోరంగా ఉల్లంఘించింది. అఫ్గానిస్థాన్‌లోని ఆస్పత్రులు, పౌర సౌకర్యాలపై పాక్ బాంబు దాడులు చేసింది. బెలూచిస్తాన్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో సొంత పౌరులపైనే పాక్ ఎటాక్స్ చేసింది. వివిధ ప్రావిన్సులలో మతపరమైన మైనారిటీలపై దాడులు చేసింది. అలాంటి పాక్‌కు దౌత్యపరమైన వ్యవహారాల్లో స్థానం ఉండకూడదు" అని ట్వీట్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ రాసుకొచ్చారు.

**మోదీ దౌత్యంలో ఆర్భాటమే తప్ప, ప్రభావం లేదు**

"పశ్చిమాసియా యుద్ధంలో మధ్యవర్తిత్వ పాత్ర కోసం పాక్‌ను పరిగణనలోకి తీసుకోవడం అనేది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దౌత్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. మోదీ కౌగిలింతల దౌత్యం(హగ్లోమసీ) ఆర్భాటంగా ఉండే తప్ప, ప్రభావవంతంగా లేదు. భారత ప్రధాని సాహసోపేతంగా స్వేచ్ఛాయుత నిర్ణయాలను తీసుకోలేకపోతున్నారనే ఆరోపణ ఉంది. తనను తాను విశ్వగురువుగా చెప్పుకునే ప్రధాని మోదీ వైఫల్యం వల్లే చీలిపోయిన పాక్ లాంటి దేశానికి బ్రోకర్‌గా మారే అవకాశం దక్కింది. 26/11 అనంతర కాలంలో మన్మోహన్ సింగ్ హయాంలో పాక్ అంతర్జాతీయంగా ఏకాకిగా ఉండేది. అయితే 2025 ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి జరగడానికి ముందు పాక్ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ రెచ్చగొట్టే వ్యాఖ్యలను చేసినా, పాక్‌ను భారతదేశం ఏకాకి చేయలేకపోయింది. దీనివల్లే ఆనాడు ఆసిమ్ మునీర్ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఆపరేషన్ సిందూర్ ముగిసిన (2025 మే 10) తర్వాతే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఇష్టమైన వ్యక్తిగా ఆసిమ్ మునీర్ మారారు" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.


**భారత్ సమతూకమైన విదేశాంగ విధానం**

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం అఖిలపక్ష సమావేశం జరిగిన నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఈ విమర్శలు చేశారు. పశ్చిమాసియా సైనిక ఉద్రిక్తతల విషయంలో భారత్ సమతూకమైన విదేశాంగ విధానంతోనే ముందుకు సాగుతుందని ఆ సమావేశంలో ప్రతిపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ సమావేశంలో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, విదేశాంగ మంత్రి జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ ఇంధన భద్రత, నౌకాయానం, విదేశాల్లో ఉన్న భారత పౌరుల భద్రతపై వివరించారు. పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని పక్షాలతో భారత్ దౌత్య సంబంధాలను కొనసాగిస్తోందని, సప్లై చైన్‌లను తెరిచి ఉంచుతోందని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌కు చెందిన ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ధర్మేంద్ర యాదవ్, జావేద్ అలీ, సీపీఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్, డీఎంకేకు చెందిన పి. విల్సన్, ఆప్‌కు చెందిన సంజయ్ సింగ్ సహా పలువురు ప్రతిపక్ష నాయకులు హాజరయ్యారు. అయితే, తృణమూల్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనలేదు.

తీన్మార్

# నగరాభివృద్ధికి ప్రజారవాణా కీలకం

విశ్వనగరంగా పేరుగాంచిన గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో రవాణా వ్యవస్థకు విశేషమైన స్థానముంది. నగరం విస్తరణతోపాటు రవాణా వ్యవస్థలు కూడా పెరగాల్సిన అవశ్యకత ఉంటుంది. వేగంగా అభివృద్ధి చెందుతూ మెట్రోపాలిటన్ సిటీగా ప్రత్యేక గుర్తింపు పొందిన హైదరాబాద్‌లో రోజూ లక్షలాదిమంది పలు అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తుండటంతో నగరానికి సమర్థవంతమైన రవాణా వ్యవస్థ అవసరం ఎంతైనా ఉంది. కాలుష్యం, ట్రాఫిక్ పద్మవ్యూహం లేకుండా తక్కువ ఖర్చుతో నగరంలో ప్రయాణం సాగించాలంటే వ్యక్తిగత వాహనాలకంటే ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలి. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇప్పటికే ప్రజా రావాణాలో భాగంగా కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్ర ఆర్‌టిసి బస్సులు, మెట్రో రైలు, ఎంఎంటిఎస్ సర్వీసులు వేగంగా విస్తరిస్తున్న నగర ప్రజల అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో 2050 నాటికి ప్రజా రవాణా వ్యవస్థను నగరానికి సరిపోయేలా వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించడం ఆహ్వానించదగ్గ పరిణామం. చరిత్రాత్మక హైదరాబాద్ నగరంలో నిజాం కాలం నుండే ప్రజా రవాణా వ్యవస్థ విస్తృతంగా అందుబాటులో ఉండేది. గుర్రపు బండ్ల టాంగాలతో మొదలైన హైదరాబాద్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కాలక్రమేణా అభివృద్ధి చెందింది. నిజాం స్టేట్ రైల్వే నేతృత్వంలో 1870లో నగరంలో రైల్వే వ్యవస్థ ప్రారంభమైంది. భారత దేశంలోని తొలిసారిగా 1932లో నిజాం ప్రభుత్వం బస్సు సేవలను ప్రారంభించింది. లండన్ నుండి పాత బస్సులను తెప్పించి నగరంలో తిప్పారు. ఒక్కో బస్సులు 15 నుండి 20 మంది ప్రయాణికులు ప్రయాణించేవారు. తొలుతగా 27 బస్సులు, 160 మందికిపైగా సిబ్బందితో ప్రారంభించిన ప్రజా రవాణా వ్యవస్థ యావత్ దేశానికి స్ఫూర్తిగా నిలిచింది.ప్రజా రవాణా వ్యవస్థలో ఘన చరిత్ర గల హైదరాబాద్‌లో కాలానికి అనుగుణంగా ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నా వేగవంతంగా విస్తరిస్తున్న నగరం, పెరుగుతున్న జనాభాకు సరిపోవడం లేదు. నగరం నలువైపులా శివార్లలోని బస్తీలు, కాలనీల వరకు ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. సిటీలో వేగవంతమైన ప్రయాణం కోసం మూడు మార్గాల్లో మెట్రో రైలు పరిగెడుతోంది. అన్ని వర్గాలకు అందుబాటులో ఉండే సరసమైన ధరలో ఎంఎంటిఎస్ సేవలు అందిస్తోంది.



అయినా హైదరాబాద్ బృహత్ నగరం జనాభా కోటిన్నరకు చేరుకుంటున్న దశలో ప్రస్తుత ప్రజా రవాణా వ్యవస్థ ప్రజావసరాలను తీర్చడంలేదని కచ్చితంగా చెప్పవచ్చు. సరిపోని ప్రజా రవాణాతో ప్రజలు ప్రయివేట్, వ్యక్తిగత వాహనాల రవాణా వైపు చూడాల్సి వస్తుంది. వాహనాల పెరుగుదలతో నగరంలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జనాభా, వాహనాల సంఖ్యకు తగ్గట్టు రోడ్ల విస్తరణ జరగకపోవడంతో ట్రాఫిక్, కాలుష్య సమస్యలొస్తున్నాయి. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా (హెచ్ఎంఎ) 2050 సమగ్ర మొబిలిటి ప్లాన్ (సిఎంపి)కి సర్వేలో వెల్లడైన వివరాల ప్రకారం 2024 ఆగస్టు 31నాటికి నగరంలో 92.13 లక్షల వాహనాలుండగా, వాటిలో కార్లు 16.15 లక్షలు, ద్విచక్రవాహనాలు 67.58 లక్షలున్నాయి. భారీగా సొంత వాహనాలతో నగరంలో కాలుష్యం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 100 నుండి 170 మధ్య ఉండడం ప్రమాదకరాన్ని హెచ్చరిస్తోంది. రోడ్లపై అధిక వాహనాల ప్రయాణంతో నగరంలో సాధారణ సమయాల్లో 10 కిలోమీటర్ల ప్రయాణానికి అరగంట, పీక్ సమయాల్లో గంటకు 16 కిలోమీటర్ల ప్రయాణమే సాధ్యమవుతుండడంతో ట్రాఫిక్ సమస్యను కళ్లకు కడుతున్నాయి. గ్రేటర్ నగరంలో ప్రస్తుతమున్న ప్రజా రవాణా, మౌలిక వసతులు సరిపోవడం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రోజూ 32,000 వేల ట్రిప్పుల సర్వీసులతో మూడు వేలకుపైగా ఆర్‌టిసి బస్సులు 25 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నా కిక్కిరిసిపోతుండడంతో ప్రజలు ఎక్కడానికి భయపడుతున్నారు. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి, రద్దీకి తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచకపోవడంతో ప్రయాణికుల కష్టాలు రెట్టింపయ్యాయి. మియాపూర్ నుండి ఎల్‌బినగర్ వరకు, జెబిఎస్ నుండి ఎంజిబిఎస్ వరకు, నాగోల్ నుండి రాయదుర్గం వరకు మూడు మార్గల్లో సుమారు 70 కిలోమీటర్లలో 57 స్టేషన్ల మీదుగా మెట్రో రైలు ప్రయాణికులు సేవలందిస్తున్నా రద్దీ సమయాల్లో అక్కడ కాలుపెట్టే పరిస్థితులు కూడా ఉండడం లేదు. మరో వైపు దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ఎంఎంటిఎస్ రైళ్లు సుమారు 120 కిలోమీటర్ల పైగా సేవలందిస్తున్నాయి. ఈ రైళ్లలో తక్కువ ధరతో ప్రయాణం లభిస్తున్నా ఉన్న కొద్ది మార్గంలో కూడా సమయపాలన పాటించకపోవడంతో నగర వాసులకు వీటిపై భరోసా లేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ మూడు ప్రజా రవాణా వ్యవస్థలు నగర ప్రయాణికులకు ఏమాత్రం సరిపోకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. విస్తరిస్తున్న నగరానికి అనుగుణంగా ప్రజారవాణా అభివృద్ధి ఆవశ్యకత గుర్తించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించి ఆచరణలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. దీనికి ఏటా రూ. 15 కోట్లను ఖర్చు చేయాల్సి ఉంటుంది. 2026 నుండి 2025 వరకు మెట్రో కోసం రూ. 1,65,873 కోట్లు, ఎంఎంటిఎస్ కోసం రూ. 22,378 కోట్లు, బస్సుల కోసం రూ. 7336 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని నివేదికలు చెబుతున్నాయి. నగర ప్రజారవాణాపై ఆర్థిక అభివృద్ధి ప్రణాళిక (ఇడిపి), సిఎంపి 2050 వరకు చేపట్టాల్సిన పలు ప్రణాళికలను బ్లూ, గ్రీన్ విభాగాలుగా విభజించి ప్రతిపాదించింది. 2050 వరకు సమగ్ర రవాణా ప్రణాళిక అమలు కోసం రూ. 4 లక్షల కోట్లు అవసరమని గుర్తించారు. నగరంలో మెట్రో రైలును మూడు దశల్లో 2050 నాటికి 556.6 కిమీలకు, ఎంఎంటిఎస్ నెట్‌వర్క్‌ను 2050 నాటికి 336.4 కిమీలకు విస్తరించాలని ప్రతిపాదించారు. ప్రత్యేక బస్ మార్గాలను ఏర్పాటు చేయడంతోపాటు బిఆర్‌టిఎస్, డిబిఎల్ సదుపాయాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 2050 నాటికి 7 బస్, ట్రక్ టెర్మినళ్లు ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోనున్నారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా 29 చోట్ల వంతెనలు నిర్మించనున్నారు. 2030 నుండి 2040 వరకు, పిమ్మట 2050 వరకు దశలవారీగా కొత్త రోడ్లు, హైవేలు, 18 మీటర్ల కారిడార్లు మొత్తం మీద 2050 నాటికి నగరంలో 19 వేల కిమీలకు పైగా రోడ్ నెట్‌వర్క్‌ను పెంచేందుకు ప్రణాళిక్లు రూపొందించారు. అంతేకాక 2050 నాటికి 75 గ్రేడ్ సెపరేటర్లు, 120 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్కైవాక్‌లు, 34 ఆరఒబిలు, 16 ఆర్‌యుబిలు, 8 చోట్ల ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించేందకు విస్తృతమైన ప్రణాళికలను రూపొందించారు.

# నేడు శ్రీరామ నవమి

## శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవము



తెలుగువారి ఆరాధ్య దైవం మర్యాద పురుషోత్తముడు శ్రీరామచంద్రుడు కొలువైన భద్రాచలం కేవలం ఒక పుణ్యక్షేత్రం మాత్రమే కాదు. అది తరతరాల భక్తి పరంపరకు అచశీ చలమైన విశ్వాసానికి శాస్త్రబద్ధమైన ఆచారాలకు ఒక సజీవ సాక్ష్యం. ప్రతి ఏటా క్షేత్ర శుద్ధ నవమి నాడు భద్రాద్రిలో జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవంలో కకల్లాణానికి ఒక సజీవ సాక్ష్యం. ప్రత్యేక గా నిలుస్తుంది. అయితే ఇటీవలి కాలంలో ఈ మహోత్సవంలో పట్టించే "ప్రవర"విషయంలో తలెత్తిన చర్చలు. కేవలం ఆధ్యాత్మిక పరిధులకే పరిమితము కాకుండా, సామాజిక ఆదోలను న్యాయస్థాన విచారణకు దారితీసాయి. భద్రాద్రి రాముడిని "దశరథ తనయుడిగా" సంబోధించా "రామనారాయణుడిగా" కీర్తించాల అనే ప్రశ్న చుట్టూ జరుగుతున్న ఈ మధనం ప్రాచీన సాంప్రదాయాలకు ఆధునిక పాలన నిర్ణయాలకు మధ్య ఉన్న ఒక సున్నితమైన ధర్మసూక్షాన్ని ఎత్తు చూపుతుంది. ఈ వివాదాన్ని లోతుగా విశ్లేషిస్తే ఇందులో దాగి ఉన్న చరిత్రక సత్యాలు. ఆగమన శాస్త్ర రహస్యాలు భక్తుల మనో వేగాల మేల వింపు స్పష్టంమ వుతుంది. భద్రాచలం క్షేత్ర చరిత్రను పరికిస్తే ఇది 17వ శతాబ్దంలో భక్త రామదాసుగా ప్రసిద్ధి చెందిన కంచర్ల గోపన్న అకుశీటి త దీక్షతో రూపుదిద్దుకున్న అద్భుత అధ్యాత్మిక నిలయం రామదాసు కాలం నుండి నేటి వరకు సీతారాముల కళ్యాణం ఒక నిర్దిష్టమైన పద్ధతిలో వాల్మీకి రామాయణో క్తైమైన రీతిలో జరుగుతుంది. వైకుంఠ రాముడిగా, శంకు చక్రాలతో వెలసిన ఈ స్వామికి కళ్యాణం జరిపించే సమయంలో "ప్రవర"పట్టణం అత్యంత కీలకమైన ఘట్టశీ, హైందవ వివాహ సాంప్రదాయంలో ప్రవర అంటే కేవలం వంశవృక్షం కాదు, అది వధూవరుల ఋషి పరంపరను, గోత్రాన్ని, వేద శాఖల వారి పూర్వికుల ఘనతను ప్రకటించే ఒక పవిత్ర సంకల్పం. వివాహ వేదికపై వరుడు తన వంశ ములాలను ప్రకటించడం ద్వారా ఆ సంస్కారానికి అధికారికత. శాస్త్రబద్రతచేకూరుతుంది. భద్రాద్రి కళ్యాణం లో రాముడి ప్రవరను పఠించేటప్పుడు ఆయనను సూర్యవంశసజాతుడిగా, ఇక్షాంశు వంశ మణిగా దశరథ మహారాజు కుమారుడిగా అభివర్ణించడం తరతరాలుగా వస్తున్న ఆచారం అయితే, గత కొన్ని పద ప్రయోగాలన్ని చేర్చడం వివాదానికి కేంద్రబిందువైంది. సాంప్రదాయ పండితులు, ఆగమన శాస్త్ర నిపుణులు హిందూ సంఘాల వాదన ప్రకారం శ్రీరాముడు విష్ణు యొక్క అవతారమే అయినప్పటికీ ఆయన "నర రూపంలో అవతరించిన పురుషోత్తముడు, రామాయణ అశీతార్ధం ప్రకారం రాముడు తనను తాను ఒక సామాన్య మానవుడిగా (ఆత్మానం మనుష్యం మవునే) భావించుకుంటూ ధర్మాన్ని ఆచరింప చూపారు. వివాహ సమయంలో వరుడు తన తండ్రి. తాతల పేర్లను చెప్పడం శాస్త్రం. రాముడు దశరథుని కుమారుడిగా భూమిపై జన్మించినప్పుడు. ఆయన వివాహ ప్రవర లో "దశరథ తనయుడు"అని ఉండాలి తప్ప. దైవత్వపు "నారాయణ" నామాన్ని చేర్చడం సాంప్రదాయ విరుద్ధమని వారు గట్టిగా వాదిస్తున్నారు. ఒక పదం మారిన అది ఆ వివాహ సంస్కారంలో నీ భావాన్ని ప్రాచీనతను దెబ్బతీస్తుందని శతాబ్దాల నాటి రామదాసు సాంప్రదాయాన్ని మార్చే హక్కు ఎవరికీ లేదని వారు స్పష్టం చేస్తున్నారు. భద్రాద్రి లో వెలసిన స్వామి వైకుంఠ రాముడని, ఆయన చేతిలో శంకు చక్రాలు ఉన్నాయని. కావున ఆయన "నారాయణ" స్వరూపంగా ప్రవరలో పేర్కొనడంలో తప్పేముందని వారు ప్రశ్నిస్తున్నారు. భక్తులకు పరమాత్మ యొక్క సర్వవ్యాప్యకత్వాన్ని తెలియజేయడమే దాని వెనుక ఉన్న ఉద్దేశం అని వారి అభిప్రాయం అయితే, విగ్రస రూపం ఏదేమైనాప్పటికీ. కళ్యాణ ఘటం అనేది రామాయణ ఇతి వృత్తం ఆధారంగానే జరుగుతుందని, అక్కడ దశరథ తనయుడి గానే రాముడు ఉండాలని వారు గుర్తు చేస్తున్నారు.

దశరథుని ఆస్థానం విశ్వామిత్రుని ఆగమనంతో ఉలిక్కి పడినట్లవుతుంది. ఆ ఉలికిపాటు నుండి తేరుకొని దశరథుడిని రామలక్ష్మణులను తనతో పాటు పంపమని విశ్వామిత్రుడు అడగడంతో కథ మొదలవుతుంది. ఇంకా పసివాళ్లని మథనరపడుతున్న దశరథునికి వారి క్షేమానికి తనే భరోసాగా నిలబడి రామలక్ష్మణులను తనతోపాటు తెచ్చుకుంటాడు. విశ్వామిత్రుడు వాళ్లను మళ్లీ క్షేమంగా దశరథునికి అప్పగించిదాకా అతనికి శాంతిలేదు. శ్రీరాముడిని తిరిగి అప్పగించడం ఒంటరిగా కాదు సీతమ్మతో కలిపి జంటగా!

రాముడి ఆదర్శ జీవనంలోకి ఒక పరమోత్కృష్టమ యిన లక్ష్యసిద్ధికి ఫలితం సీత వనవాసం. ఆ వనవాసం మూలకంగా తన పుత్రుడికి రాజ్యం కట్టబెడదామన్న కైకేయి ఎత్తు పారలేదు. దాని వలన గూటాన్ని వదులు చేసి, మరీ కోట్టినట్లు రాముడి పట్టాభిషేక విషయం గట్టిపడిపోయింది. భరతుడు రాజ్యం అక్కర్లేదన్న తరువాత రాముడు అరణ్యవాసాన్ని కొనసాగించడానికి ఎటువంటి వ్యావహారి కమయి. కారణమూలేదు. కేవలం తండ్రికి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి రాముడు అరణ్యవాసాన్ని శిరసావహిం చాడు. సీతకు అరణ్యవాసంలో వైరభావం వల్ల కలిగిన ఎటువంటి బాధలేదు. అది ఒక తపస్సు. ప్రేమ పుష్కలంగా వెల్లి విరిసిన కాలమది. అయోధ్యలో ఆమె యువరాణి కాబోతుంది. కావలసినంత మంది దాసదాసీలు. మామగారు ముగ్గురు అత్తగార్లు అవకాశం ఉండేవారు. అడ్డులేని ప్రేమ కలాపాలకు ఏ మాత్రం అవకాశం ఉండేది కాదు. నగరంలో నివసించే వారికి అరణ్యములకు సంబంధించిన రమ్యకల్పనా సృష్టిలాంటిది ఆ అరణ్యవాసం. లేళ్ళ గుంపులు, హంసలు, గోదావరి రమణీయ ప్రవాహం. దూరదూరాలకు వ్యాపించి ఉన్న అక్కడి ఇసుక మైదానాలు చెదురు ముదురుగా ఋష్యాశ్రమాలు, క్రూరజంతువులు, రాక్షసులు ఉండేవారు. వారిని చూచి అప్పుడప్పుడు శరీరం భయకంపితం అవుతూ ఉండేది. కాని అవమానమనే కంటకం ఎక్కడా బాధ కలిగించేది కాదు. పుత్రులతో వియోగం లేదు వచ్చీపోయే అతిథుల గొడవ లేదు. ఒక సుందర పార్శ్వ భూమిలో ఒక ముద్దరాలు ప్రణయినిగా మారి పోయింది. వాల్మీకి తన సమస్త కావ్య కళను ఈ కొండలో బలికించేస్తాడు. అరణ్య వాసంలోని ఈ సమయం ఎంత రమణీయంగా, సుఖప్రదంగా గడిచిందంటే, గర్భం ధరించినపుడు కూడా అరణ్యాలకు వెళ్ళి ఉండాలన్న కోర్కె ఆమెకు కలిగింది. సీత రావణుడి చెరలో అశోకవనంలో సీత దుఃఖపూరిత సమయం గడపాల్సి వచ్చింది. కని ఆమెకు రావణుడు బలత్కరిస్తాడని భయమేలేదు. ఆమె చుట్టూ రాక్షస స్త్రీలు ఉండేవారు. వారు భయంకర రూపం కలవారు. 'నిన్ను తినేస్తా' మనేవారు. అంటూ ఉండేవారు. రావణుడు సంపన్నుడు, విద్వాంసుడూ, అయిన రాజు అతని వద్ద నరభక్షకులయిన రాక్షసులుండడం విచిత్రమనిపిస్తుంది. రామ రావణుల సమస్త ప్రవరణమే విచిత్రమయింది. రాముడి సైన్యం వానరులు. భల్లూకాలు, అటువైపు రాక్షసులు. కథథ అంతా అద్భుతమూ, రమణీయమూ లోకోత్తరమూ అయినటువంటిది. రాముడు ఆదర్శపురుషుడు. సీత ఆదర్శ పత్ని. రాముడు పితృభకిత పరాయణుడు సత్య పరిపాలకుడు. ఏకపత్నీవ్రతుడు. శూరవీరుడు. ఇదంతా నిరూపించడానికి యుద్ధం అవసరమయింది. నాయిక ఆపదలో చిక్కుకొనేట్లు చేయాలి. నాయకుడు ఆ ఆపదనుండి ఆమెను తప్పించాలి. ధీరోదత్తుడయిన నాయకుడు ప్రణయ సాధ్వి అయిన నాయిక, ప్రణయంలో అన్ని దశలు, ప్రారంభ ప్రణయమూ ప్రౌఢావస్థలో ప్రణయమూ. తరువాత విరహమూ విరహంలో ప్రేమ వర్ణనలు. 'ఇవన్నీసంస్కృత కావ్య సంప్రదాయానికి అనుగుణమయినవే. యుద్ధం కూడా అటువంటిదే. ఇంత యుద్ధం జరిగినా అయోధ్యకు దాంతో మీ సంబంధం లేదు. అయోధ్య ఏ మాత్రం యుద్ధంలో పాల్గొనలేదు. రాముణ్ణి సింహాసానీనుణ్ణి చేయాలని ఎదురు చూస్తూ ఉంది. అవకాశం ఏర్పడగానే అయోధ్య రాజ్యం రాముడికి లభించింది. సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. పుత్రులు మాతృచరణాలకు నమస్కరించారు. కోడలు అత్తలకు నమస్కరించింది యుద్ధ జ్వాలలు అయోధ్యకు సోకనేలేదు. అది కేవలం కథలో భాగంగా ఉండిపోయింది. సీత క్షణక్షణము కావ్యాదర్శం కాపాడబడింది. వనాల్లో పర్వతాల్లో సీతారామ లక్ష్మణులు ముగ్గురు కలిసి మెలిసి తిరుగుతూ ఉండేవారు. అందుచేత ఆమెనపహరించుకు పోవడం సులభం కాలేదు. రాముడే కాదు. ఒక్క లక్ష్మణుడు ఆమెను కాపాడ్డానికి సామర్థ్యం కలవాడు. ఇద్దరు లేని సమయంలో సీత మొండితనం మూలకంగా గీతదాటి చాల దూరం వచ్చేసాక అపహరించబడింది. సీతాపహరణానికి దోషం సీతదే. రామలక్ష్మణులది కాదు. సీతదుఃఖ స్వరూపం. వేరే రకమయినది. ఆమె ఇక్కట్లకు లోనవుతుంది. కానీ అవి తొలగించబడతాయి. ప్రతి ఆపద నుండి ఆమె రాముడు అతని సహచరులు క్షేమంగా బయట పడతారు. రావణుడితో జరిగిన యుద్ధం కేవలం సీతకొరకే. సీతను తిరిగి ఇచ్చివేసినట్లయితే యుద్ధం జరిగి ఉండవక పోవును. రామ, రావణ యుద్ధానికి ఒకే ఒక కారణం సీత. రామకథ, రాముడు వెళ్ళబుచ్చడమూ అపనింద. సీతపరిత్యగం. సీతకు నిజమైన ఆపద. స్వయంగా భర్తయే ఆమెను వదిలేస్తాడు. కాని సీత పరిత్యాగంలో అంతిమ సన్నివేశంలో సీత సర్వనాశనమే జరుగుతుంది. ఒకసారి అగ్ని పరీక్షను ఎదుర్కొని ఆమె ప్రజల విశ్వాసాన్ని చూరగొని ఆనందంగా మనగలిగింది. మరి ఇప్పుడు అలా చేయలేదు. మట్టిలో కలిసిపోయింది. ఈ సంఘటన ప్రభావం ప్రతి భారతీయుడి హృదయం మీద చెరగరాని ముద్ర వేసింది. ఈ ఇక్కట్లను సృష్టించడంలో రచయితకు ఒక కారణం ఉండి ఉండవచ్చును. రామాయణ కథలక్షమే. మర్యాద పురుషోత్తముడు అంటే సర్వాంగణమయిన ఉత్తమ నాయకుని ఉదాత్త రూపానిన చిత్రీకరించడమే. నాయకుడు అనిన కఠోర పరీక్షల్లోనూ నెగ్గి, తప్తకాంచనంలా, దుగ్ధస్వచంలా అతి నిర్మలంగా బయట పడ్డాడు కాని ఇంకా అగ్ని పరీఓ మిగిలే ఉంది. ఒకవైపు తన ప్రేమ మరోవైపు ప్రజల అభిరుతం. ఇలా విభిన్న భావాల సంఘర్షణను సృష్టించి రాజనే వాడు ప్రజల కోసం తన సమస్త స్వార్ధాలను సర్వస్వాన్ని కూడా త్యజించి వేయాలని చూపించాలి. రాముడు అటువంటి రాజేనన్న విషయం నిరూపితమయింది. కాని దురదృష్ట వశాత్తు రాముడు స్వీకరించిన మార్గం ఉత్తమమైనదని ఆపవాద రహితంగా నిరూపించబడలేదు. స్వార్ధత్యాగం అంటే నిరపరాధియయిన ఒక వ్యక్తి పట్ల అన్యాయం చేయడమేనా రాముడు తన రాజ్యాన్నే వదిలిపెట్టలేడా? కాళీదాసు భవభూతిలాంటి మహాకవులకు సీత పరిత్యగ ఘట్టం అంతగా నచ్చలేదు. ఈ క సన్నివేశం మూలంగా రాముడి కీర్తికి కళంకం వచ్చిందనే చెప్పాలి. రాముడి నీడలా సంచరించిన సీతకు ఇప్పుడు తన స్వీయ వ్యక్తిత్వంతో సీయ దుఃఖాలను అవమానాలను స్వయంగా నిరాకరించి వేయదగిన అవకాశం లభించింది. సీత చేయరాని పని చేసింది. ఆమె పూర్తిగా ప్రాయాశ్చిత్తం చేసుకోవల్సి వచ్చింది. తమ్ముణ్ణి సీతకు రక్షణగా ఉంచి, రాముడు లేడి వెంట పరుగెత్తాడు. రాముడి కేకలు విని, అతని సహాయార్థం వెళ్ళమని సీత లక్ష్మణుడితో అన్నది. లక్ష్మణుడికి ఆమెను వంటరిగా వదిలి వెళ్ళడం ఇష్టం లేదు. దాంతో సీతకు చాలా చెడుగయిన సందేహం కలిగి, లక్ష్మణుణ్ణి నానా మాటలు అన్నది. దీని ఫలితమేమిటయ్య అంటే రావణాసురుడికి సీతను అపహరించే అవకాశం లభించింది. బంగారు లేడి అనే పన్నాగమంతా ఆమెను అపహరించుకు పోవడానికే కదా. అంతకు ముందు చూస్తే శూర్పణఖను అపహాస్యం చేసి ఆమెను అవమానాల పాలు చేశారు. దీని ఫలితమే సీతాపహరణమని చెప్పవచ్చును.

శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవము స్వస్తిశ్రీ పరాభన నామ సంవత్సర చైత్రశుద్ధ నవమి శుక్ర వారం తేదీ 27-03-2026పర్వదినమున మధ్యాహ్నం 11-52గంటలకు పునర్వసు నక్షత్రయుక్త మిథున లగ్న పుష్కరాంశము శ్రీరామ నవమి. మిథిలాపురాధఈశ్వర రాజాధిరాజ రాజ మార్తాండ గౌతమున గోత్ర మహారాజు రాజశ్రీ 'జనక మహారాజు'గారి కుమారియైన చి.ల.సౌ. సీతా మహాలక్ష్మిని, అయోధ్యపురాధీశ్వర రాజాధిరాజ రాజమార్తాండ వశిష్ఠవ గోత్ర మహారాజు శ్రీ దాశరథి మహారాజు గారి దివ్య కుమారుడైన చి.శ్రీశ్రీశ్రీ శ్రీరామ చంద్రమూర్తికి ఇచ్చి శ్రీ రామాలయం మరియు కళ్యాణ మండపములలో ఈ భగవత్ లీలా కళ్యాణము కనులారా వీక్షించండి. తరించండి.

**శ్రీ రామ నామం వల్ల కార్యసిద్ధి**
**శ్రీరామ రామ రామేతి**
**రమే రమే మనోరమే,**
**సహస్త్ర నామ తత్తుశీల్యం**
**రామనామ వరాననే.**

**"మూడుసార్లు వినే వరకు ఓపిక పట్టండి అప్పుడు విష్ణు సహస్రనామం మొత్తం విన్న ఫలితం వస్తుంది."**

**కొలనుపాక కుమారస్వామి, వరంగల్**
**మొబైల్-9963720669**

# ధరల పెంపు - హరిత పరిష్కారం

యుద్ధాలు ఎప్పుడు వస్తాయో మనం ముందుగా కనుక్కోవడం కష్టమే, కానీ వాటి వల్ల కలిగే ఆర్థిక నష్టాల నుండి మనల్ని మనం కాపాడుకోగలం. హరిత ఇంధనాల వినియోగం అనేది కేవలం పర్యావరణ హితం మాత్రమే కాదు, అది మన దేశ భద్రతకు సామాన్యుడి జేబుకు శ్రీరామరక్ష. యుద్ధ మేఘాల చాటున భారత్ స్వయం సమృద్ధి దిశగా నడవాలంటే హరిత పరిష్కారమే మార్గం. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఇజ్రాయెల్ - ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ఈ యుద్ధం ప్రభావం కేవలం ఆ దేశాలకే పరిమితం కాకుండా, గల్ఫ్ రీజియన్ నుండి ముడి చమురు దిగుమతులపై ఆధారపడే మన భారత్ వంటి దేశాలపై తీవ్రంగా పడుతోంది. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 110-120 డాలర్లు దాటిపోవడంతో, మన దేశంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి.భవిష్యత్తులో మరే ఇతర ప్రపంచ యుద్ధాలు వచ్చినా మన ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం కాకుండా ఉండాలంటే, మనం విదేశీ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించి, ప్రకృతి సిద్ధమైన 'హరిత ప్రత్యామ్నాయాల' వైపు మళ్లడం అత్యవసరం. ముందుగా రవాణా రంగంలో 'ఎలక్ట్రిక్ విప్లవం' రావాలి. పెట్రోల్ ధర వంద దాటిన వేళ, ఎలక్ట్రిక్ వాహనం (ఇవి) వాడటం వల్ల కిలోమీటరుకు కేవలం 15 నుండి 20 పైసలే ఖర్చవుతుంది. ప్రభుత్వం అందిస్తున్న ఖఓ ఇ-ఆఖీఎఇ వంటి పథకాల ద్వారా ఎలక్ట్రిక్ టూ-వీలర్లపై దాదాపు 10,000 నుండి 30,000 వరకు రాయితీ లభిస్తోంది. ఇంధన కొరతను ఎదుర్కోవడానికి ఇది అత్యంత సులభమైన మార్గం. కేవలం వాహనాలే కాదు, మన ఇళ్లలో కూడా మార్పు రావాలి. 'పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకం' ద్వారా ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే, నెలవారీ కరెంటు బిల్లుల నుండి విముక్తి లభిస్తుంది. 3 కిలోవాట్ల వరకు సోలార్ సిస్టమ్ పెట్టితే ప్రభుత్వం సుమారు 78,000 వరకు సబ్సిడీ ఇస్తోంది. దీనివల్ల మన సొంత విద్యుత్తు మనమే తయారు చేసుకోవచ్చు, తద్వారా చమురుతో తయారయ్యే థర్మల్ పవర్ పై భారం తగ్గుతుంది. మరో అద్భుతమైన ప్రత్యామ్నాయం 'ఇథనాల్ బ్లెండింగ్'. మన రైతులు పండించే చెరకు వ్యర్థాల నుండి తీసే ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపడం వల్ల విదేశాల నుండి దిగుమతి చేసుకునే ముడి చమురు అవసరం తగ్గుతుంది. ఇప్పటికే మన దేశం 15% నుండి 20% వరకు ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను విజయవంతంగా వాడుతోంది.

# గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమాలు

## ఆయిల్ పామ్, ఉద్యాన పంటల సాగు లాభదాయకం.. పంట మార్పిడితో అధిక ఆదాయం



**మహబూబాబాద్ జిల్లా, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**
ఆయిల్ పామ్, ఉద్యాన, కూరగాయలు, పండ్లు, పూలు, మల్బరీ మొదలైన మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు, పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకం, మామిడి కాయలకు ఫ్రూట్ బాగింగ్ మరియు రాయితీలు వేసవిలో తీసుకోవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు గురువారం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న మరిపెడ, చిన్నగూడూరు, మహబూబాబాద్ మండలాలలోని సాగులో ఉన్న ఆయిల్ పామ్, మామిడి, సపోటా, కూరగాయలు మరియు ఉద్యాన పంటలను సందర్శించి రైతులకు వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పలు రకాల సాంకేతిక, యాజమాన్య పద్ధతులు తెలియజేయడం జరిగింది. వేసవిలో పచ్చి రొట్ట ఎరువులు వేసుకోవాలన్నారు. వరి, పత్తి, మిరప, మొక్కజొన్న వంటి పంటలకి బదులుగా మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్, అన్ని రకాల కూరగాయలు, పండ్లు, మునగ, ఉల్లి, వెల్లుల్లి, పూలు, మల్బరీ మొదలైన పంటలు సాగు చేయాలన్నారు.

**రాయితీ వివరాలు**

**ఆయిల్ పామ్ పథకం**

ఆయిల్ పామ్ విస్తరణ – మొక్కలకు ఎకరం
11,600/-
మొదటి సంవత్సరం ఆయిల్ పామ్ తోటల నిర్వహణ మరియు అంతర పంటల సాగు
4,200/-
రెండవ సంవత్సరం ఆయిల్ పామ్ తోటల నిర్వహణ మరియు అంతర పంటల సాగు
4,200/-
మూడవ సంవత్సరం ఆయిల్ పామ్ తోటల నిర్వహణ మరియు అంతర పంటల సాగు
4,200/-
నాలుగవ సంవత్సరం ఆయిల్ పామ్ తోటల నిర్వహణ మరియు అంతర పంటల సాగు
4,200/-
బిందు సేద్యం 22,518/-
మొత్తం రాయితీ 50,918/-

మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని, నిత్యం రోగనిరోధక శక్తికి, ఆరోగ్యంగా ఉండటానికి పోషకాలు అందించే పండ్ల తోటలు అయిన జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్, కూరగాయలు, ఆకు కూరలు, మునగ, వెదురు మొదలైనవి సాగు చేయాలని తద్వారా ఎకరానికి లక్ష రూపాయలు నికర ఆదాయం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రో ట్రే లో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలన్నారు. బోర్ల క్రింద ఆయిల్ పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, పూలు, మల్బరీ, పలు రకాల ఉద్యాన పంటలు సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు డా.భీమసాగర్, టి. వెంకన్న, ఉద్యాన, ఆయిల్ ఫెడ్ సిబ్బంది టి. విజయ పాల్ రెడ్డి, డి. రాజ కిశోర్, వై.అనిల్, యం. ఐ. కంపనీ జిల్లా రెప్రెజెంటేటివ్ బి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సరిపడా ఇంధన, ఎల్పిజి గ్యాస్ నిలువలు

## ప్రజలెవరు అసత్య ప్రచారాలను నమ్మవద్దు : జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**ములుగు జిల్లా, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**
జిల్లా ప్రజలకు సరిపడా ఇంధన, ఎల్పిజి గ్యాస్ సిలిండర్ల నిలువలు ఉన్నాయని ప్రజలు ఎవరు అసత్య ప్రచారాలను నమ్మి ఆందోళనకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్పీజీ వంట గ్యాస్ మరియు పెట్రోల్, డీజిల్ సరఫరాకు సంబంధించి ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇంధన నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని, సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో ఇంధనం, ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీల వద్ద సరిపడా స్టాక్ అందుబాటులో ఉందని, ముందస్తు బుకింగ్స్ కూడా పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇంధన సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా డీలర్లు, రీటైల్ యూనిట్లు, సివిల్ సప్లైస్ అధికారులతో సమన్వయం చేయడం జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా కూడా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. ప్రజలెవరు సోషల్ మీడియాలో,ఇతర మాధ్యమాల్లో వచ్చే అసత్య వార్తలను, వదంతులను నమ్మి ఆందోళనకు గురికావద్దని కోరారు. ఇంధనాన్ని గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.



# హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఆకస్మిక తనిఖీ చేసిన అదనపు కలెక్టర్






**భూపాలపల్లి జిల్లా, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**
జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెట్రోల్, డీజిల్ సరఫరా నిరంతరంగా, పారదర్శకంగా కొనసాగాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం భూపాలపల్లిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ (లక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారులకు అందిస్తున్న సేవలు, పెట్రోల్ మరియు డీజిల్ సరఫరా విధానం, నిల్వల పరిస్థితి, అమ్మకాల విధానం, భద్రతా ప్రమాణాలను నిశితంగా పరిశీలించారు. పంపిణీ విధానం, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, వినియోగదారులకు సమయానికి సరఫరా అందేలా అధికారులు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ప్రజలు సామాజిక మాధ్యమంలో ప్రచారం అవుతున్న వదంతులను నమ్మవద్దని, అవసరానికి అనుగుణంగా మాత్రమే ఇంధనాన్ని కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఎలాంటి కొరత లేకుండా సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఆయిల్ కంపెనీలు ఇండెంట్ల ఆధారంగా నిరంతర సరఫరా కొనసాగిస్తున్నాయని వెల్లడించారు. వదంతుల నేపథ్యంలో ఎవరైనా అక్రమంగా నిల్వలు చేయడం లేదా అక్రమంగా పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేపడితే, వారిపై చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కోసం కలెక్టర్ అధ్యక్షతన ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ పనిచేస్తోందని తెలిపారు. ఈ కమిటీ ద్వారా నిత్యవసర సరఫరాలపై నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని పేర్కొన్నారు. పెట్రోల్ బంక్ యజమానులు ధరల బోర్డులు, నిల్వ వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని, వినియోగదారులతో వినయంగా ప్రవర్తించాలని ఆదేశించారు. ఆయిల్ కంపెనీల గైడ్‌లైన్స్‌ను తప్పనిసరిగా పాటిస్తూ, తగినంత స్టాక్ నిల్వ ఉంచి, సమయానికి ఇండెంట్లు పెట్టాలని సూచించారు. ఈ తనిఖీలో పౌర సరఫరాల అధికారి శరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎస్యు రాష్ట్ర వ్యాప్త బంద్ విజయవంతం

**హనుమకొండ, మార్చి 26 (తీన్మార్ న్యూస్)**
ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో పిడిఎస్యు రాష్ట్రవ్యాప్త బంద్ పిలుపు విజయవంతంగా జరిగింది. కాకతీయ యూనివర్సిటీలో మొదలైన బంద్ బైక్ ర్యాలీ వాగ్దేవి, కే డి సి, పింగిలి, డిగ్రీ పిజీ కాలేజీ లను బందు చేస్తూ ఆర్ట్ సెండ్ సైన్స్ కాలేజీకి ర్యాలీ చేరుకొని ఆర్ట్స్ కాలేజ్ ఎదురు హైదరాబాద్ హైవే రోడ్డుపై పిడిఎస్యు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్యు మర్రి మహేష్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న పదివేల కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి ప్రతి సంవత్సరం మొండి చెయ్యి చెయ్యి చూపుతూ విద్యా ద్రోహనికి పాల్పడుతుందని రాష్ట్ర బడ్జెట్లో కనీసం 20శాతం అయినా విద్యారంగానికి కేటాయించి తెలంగాణ రాష్ట్రంలో సమస్యల వలయంతో పేరుకుపోయినటువంటి పాఠశాలను, కాలేజీలను, యూనివర్సిటీలను సమస్యలను పరిష్కరించాలని ప్రతి పేద విద్యార్థి చదువుకునే విధంగా విద్యా విధానాలను తీసుకురావాలని మూతపడుతున్నటువంటి గ్రామస్థాయి స్కూలను మండల స్థాయి స్కూలను వెంటనే ఓపెన్ చేయాలని గవర్నమెంట్ పాఠశాలలకు విద్యార్థులు వెళ్లే విధంగా నూతన విధానాలను తీసుకురావాలని ఎల్లండి సమస్యలు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఈరోజు డిగ్రీ పీజీ బీటెక్ ప్రొఫెషనల్ కోర్సులు కు పిడిఎస్యు రాష్ట్ర వ్యాప్త బందు పిలుపు ఇచ్చిందని ఈ బందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజయవంతంగా జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి విద్య తమ హక్కుగా భావించి విద్యారంగనికి రాష్ట్ర బడ్జెట్లో కనీసం 20 శాతం కేటాయించే విధంగా మరియు విద్యారంగా సమస్యలపై స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ పై గొంతు విప్పి ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారి ఎడవెల్లి అనిల్ సభ్యులు ఫ్రాహాన్,మోహన్, సుభాష్ చంద్రబోస్, సంపత్ యూనివర్సిటీ నాయకులు రాజేష్,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన గురుకులాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**మహబూబాబాద్ జిల్లా, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**



తెలంగాణ రాష్ట్రంలో గల 16 ప్రతిభ గురుకుల పాఠశాలలో (సి ఓ ఈ) 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రవేశాల కొరకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రాంతీయ సమన్వయ కర్త పీ.రత్న కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం కార్యదర్శి గారి ఆదేశాల మేరకు ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన ఈ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతోపాటు (××ు,జీజుజు,డ చీజుజు) వంటి పరీక్షలకు ఉచిత శిక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తు చివరి తేదీ 07.04.2026. పరీక్ష తేదీ ఏప్రిల్.19.2026 దరఖాస్తు రుసుము ఉచితం, ఎంపిక విధానం: ప్రవేశ పరీక్షలో కనబరిచిన ప్రతిభ మెరిట్ ఆధారంగా ఉంటుందన్నారు. దరఖాస్తు చేయు విధానం ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత షషష్.స్త్రషతీఱవర్.వశ్రీఖఅస్త్రుఋఖ.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8333800221 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని సూచించారు.

## విజ్ఞన్న మృతి జర్నలిస్టు లోకానికి తీరని లోటు

**సీనియర్ జర్నలిస్టు విజయ్ కుమార్ కు ఘన నివాళి**



**జనగామ, మార్చి 26 (తీన్మార్ న్యూస్)**
జనగామ జిల్లా సీనియర్ జర్నలిస్టు రచ్చ విజయ్ కుమార్ పత్రికారంగానికి చేసిన సేవలు మరువలేని పలువురు జర్నలిస్టులు అన్నారు. విజయ్ కుమార్ (75) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. జనగామకు చెందిన సీనియర్ జర్నలిస్టులు నల్ల లక్ష్మీపతి, మాదంశెట్టి వేణుమాధవ్ గుప్తా, చింతకింది కృష్ణమూర్తి, మన చౌరాస్తా ఎడిటర్ ఉప్పలంచి నరేందర్ గురువారం హైదరాబాద్ లోని విజయ్ కుమార్ స్వగృహంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల పాటు వివిధ దినపత్రికల్లో పనిచేసి విజ్ఞన్న అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు అన్ని వర్గాల ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. ఆయన మృతి జర్నలిస్ట్ లోకానికి తీరనిలోటు అని అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు బంధువులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

## నిర్భయ నిధులతో మహిళల భద్రతకు పెద్దపీట

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**ములుగు జిల్లా, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**



నిర్భయ నిధులతో మహిళల భద్రతకు పెద్దపీట వేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మహిళలు మరియు బాలికల రక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిర్భయ నిధి పథకం ద్వారా ములుగు జిల్లాలో "ఇన్‌క్లూజివ్ సిటీస్ ఫర్ ఉమెన్ అండ్ గర్ల్స్" పైలట్ ప్రాజెక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని తమ ఛాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళా భద్రతా ప్రమాణాలను పెంచడంపై సంబంధిత అధికారులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ములుగు జిల్లాలోని మహిళలు, బాలికలు మరింత సురక్షితమైన సౌకర్యవంతమైన అవకాశాలను కలిగి ఉండేందుకు గాను పింక్ ఆటోస్ సౌకర్యాలను కల్పించడం, జన సమూహ కూడలిలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు,వివిధ వృత్తులలో పనిచేస్తున్న బాలింత మహిళలు, వారి శిశువుల భద్రత, పరిరక్షణకై పని ప్రదేశాలలో ప్రత్యేక క్రెష్ సెంటర్ల ఏర్పాటు, డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి, జిల్లాలోని ప్రధాన పర్యాటక ప్రదేశాలైన మేడారం, లక్నవరం, రామప్ప, బోగత, మల్లూరు ఒ దేవాదుల మొదలైన పర్యాటక కేంద్రాలలో అన్ని సౌకర్యాలతో కూడిన ప్రత్యేక సెంటర్లను ఏర్పాటు చేయడానికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ అంశాలతో కూడిన సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉండగా వెంటనే ప్రతిపాదనలను చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి డబ్ల్యు ఓ ప్రేమలత, మున్సిపల్ కమిషనర్ టి రమేష్, ఆర్టీవో శ్రీనివాస్, డి ఎం సి రమా సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణ పురోగతిపై సమీక్ష

**వరంగల్ జిల్లా, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**




దేవాదుల జె. చొక్కారావు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, రాయపర్తి, వర్ధన్నపేట, నల్లబెల్లి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, ముందస్తు నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రాజెక్ట్ అమలు సజావుగా కొనసాగేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి, ఆర్డీఓలు సుమ, ఉమారాణి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వేసవిలో జాగ్రత్త లు పాటించాలి

**అధికారులు తగు చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**



వేసవి ఎండల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్త గా ఉండాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. వాతావరణ మార్పులు ప్రజా ఆరోగ్యం అనే అంశం మీద పోలీస్, వైద్య ఆరోగ్యం, వ్యవసాయ, గ్రామీణభివృద్ధి శాఖ మున్సిపల్ కమిషనర్ లు, పంచాయతీ శాఖ, తదితర శాఖలకు సంబందించిన అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని గురువారం మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. వడ దెబ్బకి ఎలాంటి నష్టాలు కలగకుండా శాఖల వారీగా వారి పరిధిలో తీసుకోనున్న యాక్షన్ ప్లాన్ ను కలెక్టర్ ముందుగా ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుత
ప్రయివేట్, ప్రభుత్వ
విద్యార్థులకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు, ఆశ వర్కర్ లకు,ా=ా ప్యాకెట్ లు అలాగే వడ దెబ్బ కి సంబందించిన మందులను పంపిణి చేయాలన్నారు. అన్నీ జీపీ, వార్డ్ ల లో, బస్ స్టేషన్ లలో, పోలీస్ స్టేషన్, నిర్మాణాలు జరిగే ప్రాంతాలలో , లేబర్ అడ్డా ల వద్ద కూలి పని చేసే కార్మికుల కోసం చలి వేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. వడ దెబ్బకు గురి అయ్యే అవకాశం ఉన్నవారిని అనగా చిన్న పిల్లలు, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి గ్రాస్తులను ఉందుగానే గుర్తించి వారికీ తగు జాగ్రత్తలు తీసుకునేలా ఆరోగ్య కార్యకర్తల ద్వారా తెలియచేయాలనీ సూచించారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్య సంస్థ లలో,అంగన్వాడీ కేంద్రాలలో ా=ా పాకెట్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక వార్డ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లకూడదని ముఖ్యం గా పిల్లలు, వృద్దులు, గర్భిణీ లు చాలా జాగ్రత్త గా ఉండాలన్నారు. తరచుగా తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, లేదా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కలిగించాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ తెలిపారు. తీవ్రమైన ఎండ, వడ దెబ్బను ఎదుర్కొనేందుకు ప్రజలు చెయవలిసినవి, చేయకూడని జాగ్రత్తలను తెలిపే పోస్టర్ అలాగే వేసవి లో పశు సంరక్షణకి సంబందించిన పోస్టర్ లను ఈ సందర్భంగా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఏసీపీ పండరి చేతన్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, డి, ఆర్డీ ఓ, జిల్లా వ్యవసాయ అధికారి, విద్యుత్ శాఖ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మార్ఐ యంత్రం ఏర్పాటు పనుల్లో ఆలస్యంపై కలెక్టర్ ఆగ్రహం



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 26 (తీన్మార్ న్యూస్):**

ఎమ్మార్ఐ యంత్రం ఏర్పాటుకు అవసరమైన విద్యుత్తు సరఫరా పనుల్లో జాప్యంపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా ప్రధాన ఆసుపత్రిని సందర్శించి ఎమ్మార్ఐ పరికరం, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో ఎమ్మార్ఐ యంత్రం ఏర్పాటు కోసం అవసరమైన విద్యుత్ సౌకర్యాల కల్పనలో జరుగుతున్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం ఉన్నట్లు గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ విధులకు గైర్హాజరు కావడంపై షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. ఎమ్మార్ఐ యంత్రం ఏర్పాటు పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆర్డిఓను పర్యవేక్షణ సంబంధిత అధికారిగా నియమించామని తెలిపారు. విద్యుత్ సరఫరా ఏర్పాటుకు అవసరమైన పరికరాలను ఇప్పటికీ సమకూర్చకపోవడంపై కలెక్టర్ ప్రశ్నిస్తూ, ఈ విధంగా కొనసాగితే పనులు పూర్తి కావడానికి ఇంకా ఎన్ని రోజులు పడుతాయని అసహనం వ్యక్తం చేశారు. యంత్రం ఏర్పాటు అవశ్యకతను దృష్టిలో ఉంచుకుని ఈ నెలాఖరు వరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప పర్యవేక్షకులు డా వెంకటరత్నం, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా రాజేష్, టిజిఎంఎస్ ఐడిసి ఏఈ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ.

## జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి జయపాల్ రెడ్డి.

**ఇబ్రహీంపట్నం మార్చి 26** ప్రాథమిక ఆరోగ్యకేంద్రము జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జయపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.తల్లులను ఆరోగ్య కేంద్రంతో అందుతున్న సేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు.గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం గర్భిణీ స్త్రీలతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు చేసుకోవాలని అన్ని రకాల వసతులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్నాయని,సాధారణ కాన్పు వల్ల కలిగే లాభాలు,తల్లిపాల ప్రాముఖ్యత,వ్యాధి నిరోధక టీకాలు తదితర విషయాల గురించి తల్లులకు వివరించారు. ఆసుపత్రిలోని ల్యాబ్ లో నిర్వహిస్తున్న పరీక్షలు,డ్రగ్స్ స్టోర్ రూమ్,వ్యాక్సిన్ స్టోర్ రూమ్,ఓపి మొదలైన వాటినీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్ వనజ వైద్యాధికారి,సి హెచ్ ఓ విజయభాస్కర్, సూపర్వైజర్లు,నర్సింగ్ ఆఫీసర్స్,ఫార్మసిస్ట్,లాబ్ టెక్నీషియన్ ఏఎన్ఎం ఆశాలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే భాగంగా

## వాహనదారులకు, ప్రయాణికులకు అవగాహన

**సిద్దిపేట :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్–అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేట మోడ్రన్ బస్ స్టాండ్ వద్ద వాహనదారులకు మరియు ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్.ఐ గోపాల్ రెడ్డి, ఎస్.ఐ ఉమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రయాణికులను ఉద్దేశించి మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐ.ఎస్.ఐ ముద్ర కలిగిన హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. "వేగం కన్నా ప్రాణం ముఖ్యం" అని గుర్తు చేస్తూ, పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపవద్దని కోరారు. సిగ్నల్ జంపింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరిస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటించాలని పిలుపునిచ్చారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాలను ప్రయాణికులకు వివరించారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించినప్పుడే ప్రమాద రహిత సిద్దిపేటను సాకారం చేసుకోవచ్చని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## జిల్లాలో ఇంధన కొరత లేదు

**పుకార్లను నమ్మవద్దు**

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ :** జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఇటీవల కొన్ని పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్లు కనిపిస్తున్న నేపథ్యంలో, పరిస్థితిని సమీక్షించి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు.జిల్లాలో ఇంధన కొరత ఉందంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అపోహలేనని స్పష్టం చేసిన కలెక్టర్, అవసరం లేకపోయినా ప్రజలు బంకుల వద్దకు చేరుకోవడం వల్ల అనవసర రద్దీ ఏర్పడుతోందన్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా కొనసాగుతోందని, పెట్రోల్ బంకుల అసోసియేషన్ ప్రతినిధులు కూడా తమ వద్ద తగిన నిల్వలు ఉన్నట్లు ధృవీకరించినట్లు తెలిపారు.ఎల్పీజీ గ్యాస్ సరఫరా సాధారణంగానే?జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్, సరఫరా ప్రక్రియ యథావిధిగా కొనసాగుతోందని, వినియోగదారులు ఆందోళన చెందవద్దని సూచించారు.క్షేత్రస్థాయిలో పర్యవేక్షణపరిస్థితిని దగ్గరగా గమనించేందుకు అదనపు కలెక్టర్లు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన చోట్ల వెంటనే చర్యలు తీసుకునేలా అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.పానిక్ బాయింగ్ చేయవద్దుసోషల్ మీడియా లేదా ఇతర మార్గాల్లో వ్యాపిస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు 'పానిక్ బాయింగ్'కు పాల్పడవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజలకు అవసరమైన ఇంధన వనరులు నిరంతరం అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు.

## మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి...

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్...

**రాయికల్ :** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గురువారం రోజున రాయికల్ మండలంలో వివిధ గ్రామాలలో 70 లక్షలతో మహిళ సంఘ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.రాయికల్ మండలం కిష్టంపేట గ్రామంలో 20 లక్షలతో రెండు,భూపతి పూర్ గ్రామంలో 20 లక్షలతో రెండు,వడ్డే లింగాపూర్ గ్రామంలో 10 లక్షలతో ఒకటి,వడ్డెర కాలనీ లో 10 లక్షలతో ఒకటి,చర్ల కొండాపూర్ గ్రామంలో 10 లక్షలతో ఒకటి మహిళా సంఘం భవనాలకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గం లో 60 కి పైగా మహిళా సంఘం భవనాలు మంజూరు అయ్యాయి.మహిళా సాధికారత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది,మహిళలకు 1300 కోట్ల బ్యాంక్ వడ్డీ ప్రభుత్వం చెల్లించింది.200 యూనిట్ల ఉచిత కరెంట్,సన్న బియ్యం,రేషన్ కార్డులు,ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని అన్నారు.ఆరోగ్య శ్రీ వైద్యం 10 లక్షలకు పెంచిందని,అత్యధిక పల్లె దవాఖానాలు జగిత్యాల మంజూరు అయ్యాయని,తెలంగాణ రాష్ట్రంలో విద్య వైద్యం మీద

# కేసీఆర్, జగన్ ఫ్రెండ్ షిప్...

# గులాబీ గూటికి జీవన్ రెడ్డి



**హైదరాబాద్ :** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తీర్పు వెలువరించినా.. ఈ వ్యవహారం మళ్లీ హైకోర్టుకు ఎక్కింది. స్పీకర్ నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ.. పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా ఆ పిటిషన్లను స్వీకరించిన తెలంగాణ హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని.. తాజాగా ఏడుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చింది. ఇక ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు ఇవ్వడం గమనార్హం. తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి రావడం లేదు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. తన నిర్ణయాన్ని ఇటీవలె వెలువరించారు. 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంటూ.. వారిపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లను అన్నింటినీ కొట్టిపారేశారు. అయితే ఈ వ్యవహారం అంతటితో ఆగడం లేదు. స్పీకర్ గడ్డం ప్రసాద్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. మళ్లీ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.ఈ క్రమంలోనే పిటిషనర్లు చేసిన వాదనలను విన్న తెలంగాణ హైకోర్టు.. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తాజాగా నోటీసులు జారీ చేసింది. అదే సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు కూడా నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే ఇదే వ్యవహారంలో దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తాజాగా కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులపై పిటిషన్‌లు దాఖలు అయ్యాయి.ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని ఈ ఏడుగురు ఎమ్మెల్యేలకు ఆదేశాలు ఇచ్చింది. ఈ పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. దీంతో పూర్తి అయిపోయింది అనుకున్న తెలంగాణ పార్టీ ఫిరాయింపుల కేసు మళ్లీ మొదటికి వచ్చింది.మరోవైపు.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు ఇటీవలె హైకోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు నోటీసులు ఇచ్చింది. దానం నాగేందర్.. బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారని.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయినట్లు తెలిపారు. అయినప్పటికీ దానం నాగేందర్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టేశారని.. ఈ నేపథ్యంలోనే స్పీకర్ ఇచ్చిన తీర్పును కొట్టేయాలని తన పిటిషన్‌లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

# పెట్రోల్ బంకుల వద్ద కొనసాగుతున్న క్యూ



**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఉదయం పెట్రోలు బంకుల వద్ద వాహనదారుల రద్దీ విపరీతంగా పెరిగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. మంగళవారం పలు బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపించడంతో ఆందోళనకు గురైన వాహనదారులు తమ ట్యాంక్ ఫుల్ చేయించుకునేందుకు బంకుల వద్దకు పోటెత్తారు. కూకట్పల్లి, ప్రగతినగర్, ఎర్రగడ్డ, సనత్నగర్, అమీర్పేట, సికింద్రాబాద్, బేగంపేట, ఖైరతాబాద్ వంటి ప్రధాన జంక్షన్లలో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి.అకస్మాత్తుగా పెరిగిన డిమాండ్ కారణంగా కొన్ని పెట్రోల్ బంకుల్లో స్టాక్ అయిపోయింది. దీంతో యాజమాన్యాలు 'నో స్టాక్' బోర్డులు ప్రదర్శించడంతో వాహనదారుల్లో మరింత ఆందోళన నెలకొంది. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి చూడటం వల్ల ప్రధాన రహదారులపై ట్రాఫిక్ స్తంభించి పోయింది. చాలా మంది వినియోగదారులు ముందస్తు జాగ్రత్తగా క్యాన్లలో కూడా ఇంధనాన్ని తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ పరిస్థితిపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పందిస్తూ కీలక విజ్ఞప్తి చేశారు. పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న వార్తలన్నీ కేవలం వదంతులు మాత్రమేనని, నగరంలో ఇంధన సరఫరాకు ఎలాంటి ఆటంకం లేదని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని, బంకుల వద్ద అనవసరంగా గుమిగూడటం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని ఇతర అధికారులు కూడా తెలిపారు. ప్రజలు సంయమనం పాటించాలని పోలీసులు కోరుతున్నారు.నగరవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ కొరత సామాన్యుడిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ముఖ్యంగా ఉప్పల్, మల్లాపూర్ వంటి ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు అకస్మాత్తుగా మూతపడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండటంతో, ఇది నిజమైన కొరతనా లేక ధరలు పెరుగుతాయన్న ఆశతో యజమానులు సృష్టిస్తున్న కృత్రిమ కొరతనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి బంకుల్లో తనిఖీలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు, ఎల్పీజీ గ్యాస్ కోసం ఆటో డ్రైవర్ల కష్టాలు వర్ణనాతీతం. లక్డీకాపూల్ వంటి రద్దీ ప్రాంతాల్లో వందలాది ఆటోలు కిలోమీటర్ల మేర క్యూ కట్టడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గంటల తరబడి నిరీక్షణతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతినడమే కాకుండా, ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. యుద్ధం కారణంగా సరఫరా దెబ్బతిందని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో తలెత్తిన ఈ ఇంధన సంక్షోభం సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేస్తోంది.

# బిజినెస్

## ఇరాన్ నుంచి 5 మిలియన్ బ్యారెళ్ల చమురు కొన్న రిలయన్స్

ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీ కాంప్లెక్స్‌ను నిర్వహిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇరాన్ నుండి సుమారు 50 లక్షల బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసింది. 2019లో అమెరికా ఆంక్షల కారణంగా ఇరాన్ నుండి చమురు దిగుమతులను భారత్ నిలిపివేసింది. అయితే ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత ఏర్పడింది. ఈ సంక్షోభాన్ని నివారించడానికి, అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ధరలను అదుపు చేయడానికి అమెరికా ప్రభుత్వం ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను 30 రోజులపాటు తాత్కాలికంగా సడలించింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న రిలయన్స్, నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ(ఐఓసీ)తో ఈ భారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ఆర్థికంగానూ, సాంకేతికంగానూ రిలయన్స్‌కు ఎంతో లాభదాయకం. ఇరాన్ ముడి చమురు నాణ్యత జామ్‌నగర్ రిఫైనరీలోని అత్యాధునిక యంత్రాలకు అత్యంత అనుకూలంగా ఉంటుంది. దీనివల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఇంధనాన్ని ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 నుండి 120 డాలర్ల మధ్య ఉండగా, రిలయన్స్ సుమారు 7 డాలర్ల ప్రీమియంతో ఈ డీల్ కుదుర్చుకున్నట్లు సమాచారం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా చమురుపై భారత్ ఏ విధంగా ఆధారపడిందో, ఇప్పుడు ఇరాన్ చమురు దిగుమతుల పునఃప్రారంభం ద్వారా భారత్ తన ఇంధన వనరులను వివిధ దేశాల నుంచి దిగుమతులు చేసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇది కేవలం రిలయన్స్‌కే కాకుండా, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల స్థిరీకరణకు కూడా పరోక్షంగా దోహదపడే అవకాశం ఉంది.

## ఐటీలో హైదరాబాద్ మేటి

**హైదరాబాద్ :** ఐటీ రంగంలో హైదరాబాద్ దూసుకుపోతున్నది. మౌలిక వసతుల కల్పన, మానవ వనరులు, సుస్థిరత కారణంగా గణనీయమైన అభివృద్ధి సాధిస్తున్నది. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తీసుకొచ్చిన పాలసీలు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపు, కేటీఆర్ విజన్ వెరసి.. ఐటీ రంగంలో హైదరాబాద్ దేశంలోనే మేటిగా విరాజిల్లుతున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'సామాజిక ఆర్థిక సర్వే-2026' సైతం పదేండ్ల బీఆర్ఎస్ పాలనా ప్రగతిని గణాంకాలతో రుజువు చేసింది. బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన పాలసీలు అద్భుత ఫలితాలు ఇవ్వడంతో, ఐటీ రంగంలో రాష్ట్రాన్ని లీడర్‌గా నిలిపినట్టు ఈ సర్వే కితాబు ఇవ్వడం గమనార్హం.తెలంగాణ పర్యాటకం

**జీసీసీలకు అడ్డాగా..**

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)కి హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా మారిందని, నగరంలో 1,500 ఐటీ, దాని అనుబంధ కంపెనీలున్నట్టు సర్వేలో తేలింది. ఇందులో మల్టీ నేషనల్ కంపెనీలతోపాటు, చిన్న, మధ్యతరహా కంపెనీలున్నాయి. 2023-24నాటికి రూ.2,68,223 కోట్ల ఐటీ ఎగుమతులు జరుగగా, 2024-25కు ఇవి రూ.3,12,941 కోట్లకు చేరాయి. అయితే 2023-24లో 9,46,285 మంది ఐటీ రంగంలో ఉపాధి పొందగా, 2024-25కి ఈ సంఖ్య 9,39,054కి తగ్గినట్టు అసెంబ్లీ సాక్షిగా తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటీ రంగంలో 7,231 ఉద్యోగాలు తగ్గిపోయాయన్నమాట. కాగా, దేశంలో 1,700 గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీ) ఉన్నట్టు నాస్కమ్, జొన్నోవ్‌లు విడుదల చేసిన 'ఇండియా జీసీసీ ల్యాండ్‌స్కేప్ రిపోర్టు' వెల్లడించింది. వీటిల్లో 19 లక్షల మంది నిపుణులు పనిచేస్తున్నట్టు వివరించింది. బెంగళూరు, హైదరాబాద్, పుణె, చెన్నై, ముంబై-ఎన్‌సీఆర్‌లో కీలక జీసీసీలున్నట్టు స్పష్టం చేసింది. హైదరాబాద్ జీసీసీలకు హబ్‌గా నిలిచిందని ఈ సర్వే తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న జీసీసీల్లో 20% నగరంలోనే ఉన్నట్టు వెల్లడించింది మరి.

# బులియన్‌లో బుల్ రన్

## మళ్లీ పెరుగుతున్న బంగారం, వెండి ధరలు

**మళ్లీ పెరుగుతున్న బంగారం, వెండి ధరలు**
**ఒక్కరోజే రూ.4,900 ఎగబాకిన తులం పుత్తడి**
**రూ.11,250 ఎగిసిన కిలో వెండి విలువ**
**గల్ఫ్‌లో తగ్గుతున్న ఉద్రిక్తతలే కారణం**



**న్యూఢిల్లీ :** దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. బుధవారం ఢిల్లీ స్పాట్ మార్కెట్లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పుత్తడి రేటు రూ.4,900 లేదా 3.38 శాతం ఎగిసి రూ.1,49,700 (అన్ని పన్నులు సహా) పలికింది. కిలో వెండి విలువ కూడా రూ.11,250 లేదా 4.89 శాతం ఎగబాకి రూ.2,41,250 (అన్ని పన్నులతో కలిపి)గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్ నుంచి వచ్చిన సానుకూల సంకేతాలే ఇందుకు కారణమని వ్యాపార వర్గాలు ప్రస్తుత ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నాయి.

**తగ్గుతున్న ఉద్రిక్తతలతో..**

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధ తీవ్రత తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్‌తో యుద్ధానికి 5 రోజులపాటు విరామం ఇస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య జరుగుతున్న చర్చలు శాంతియుతంగానే ముగుస్తాయన్న ఆశాభావం అంతటా నెలకొన్నది. దీంతో ఇన్నాళ్లూ గల్ఫ్ దేశాల్లో నెలకొన్న అశాంతి కారణంగా విజృంభించిన ముడి చమురు ధరలు సైతం దిగొస్తున్నాయి. ఫలితంగా గత 3 వారాలుగా తమ పెట్టుబడులను స్టాక్ మార్కెట్లు, గోల్డ్‌పై నుంచి డాలర్ల వైపునకు మళ్లించిన మదుపరులు.. ఇప్పుడు తిరిగి స్టాక్, పసిడి వైపునకు తెస్తున్నారు. ఈ క్రమంలోనే వరుసగా రెండు రోజులపాటు అటు స్టాక్స్, ఇటు బులియన్ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు.

**హైదరాబాద్‌లో..**

22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం బంగారం ధర రూ.3,450 పుంజుకొని రూ.1,34,450 వద్ద నిలిచింది. అంతకుముందు వరుసగా వారం రోజులపాటు ధరలు క్షీణిస్తూపోయిన సంగతి విదితమే. ఈ క్రమంలో ఇక మళ్లీ ధరలు పరుగులు పెట్టడం ఖాయమేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయిప్పుడు. పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడి, భారత్‌కు ముడి చమురు, గ్యాస్ సరఫరా సాధారణ స్థితికి వస్తే.. రేట్లు మున్ముందు బాగానే పెరుగుతాయన్న అంచనాలున్నాయి మరి. అయితే మిడిల్ ఈస్ట్‌లో శాంతి స్థాపనకు ఆటంకం ఏర్పడితే మాత్రం గోల్డ్, సిల్వర్‌పై ఇన్వెస్టర్లలో సెల్లింగ్ ప్రెషర్ కనిపిస్తుందని, ధరలు పడిపోయే వీలుందని కూడా అంటున్నారు. కాల్పుల విరమణ కోసం అమెరికా నుంచి 15 షరతులతో కూడిన ప్రతిపాదనలు ఇరాన్‌కు రావడమే కారణం.

**గ్లోబల్ మార్కెట్లో..**

అంతర్జాతీయ స్పాట్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ రేటు 82.17 డాలర్లు లేదా దాదాపు 2 శాతం ఎగిసి 4,556.55 డాలర్లకు చేరింది. సిల్వర్ వాల్యూ కూడా 2 శాతం బలపడి ఔన్స్ 72.67 డాలర్లుగా నమోదైంది. ఇదిలావుంటే ఫ్యూచర్ మార్కెట్లోనూ ధరలు పరుగందుకున్నాయి. దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (ఎంసీఎక్స్)పై ఏప్రిల్ కాంట్రాక్ట్‌కుగాను 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం రూ.5,091 పెరిగి రూ.1,44,003 పలికింది. అంతర్జాతీయంగా 157.9 డాలర్లు ఎగిసి 4,559.9 డాలర్లుగా నమోదైంది.

**ఆలయాల బంగారం బయటకొస్తే..**

దేశ ప్రజలు, ఆలయాల వద్ద 50వేల టన్నుల బంగారం ఉందని, దీని విలువ కనీసం 10 లక్షల కోట్ల డాలర్లు ఉంటుందని కేంద్ర మాజీ మంత్రి పీపీ చౌదరి అన్నారు. అయితే వృథాగా పడిఉన్న ఈ పసిడి అంతా ఆర్థిక వ్యవస్థలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. దానివల్ల విదేశాల నుంచి పుత్తడిని దిగుమతి చేసుకోవాల్సిన అవసరం పెద్దగా ఉండదని, దీంతో కరెంట్ ఖాతా లోటు (క్యాడ్)పై ఒత్తిడి కూడా తగ్గుతుందని వ్యాపార, పారిశ్రామిక సంఘం అసోచామ్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఈవెంట్‌కు హాజరైన మరికొందరు సీనియర్ మార్కెట్ అధికారులూ దీన్ని సమర్థించారు. ఇండ్లు, ఆలయాల్లో భౌతిక రూపంలో ఉన్న బంగారాన్ని బయటకు తేగలిగితే.. దేశ ఆర్థిక వృద్ధికి అది ఎంతో దోహదం చేయగలదని స్పష్టం చేశారు.


# 15.80 లక్షల కోట్లు పెరిగిన సంపద


**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో కళకళలాడుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దెబ్బకు కుప్పకూలిన మార్కెట్లు ప్రస్తుతం తిరిగి కోలుకుంటున్నాయి. వరుసగా రెండోరోజూ బుధవారం కూడా సూచీలు కదంతొక్కాయి. ఫలితంగా ఇంట్రాడేలో 1,800 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 1,205 పాయింట్లు లేదా 1.63 శాతం అందుకొని 75,273.45 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 394.05 పాయింట్లు అందుకొని 23,306.45 పాయింట్ల వద్ద నిలిచింది. దీంతో మదుపరుల సంపద అమాంతం పెరిగింది. వరుసగా రెండు రోజుల్లో సెన్సెక్స్ 2,577 పాయింట్లు లాభపడింది. దీంతో మదుపరులు రూ.15.80 లక్షల కోట్ల సంపదను పోగేశారు. బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.15,80,204.92 కోట్లు పెరిగి రూ.4,31,01,834.74 కోట్లు(4.59 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది.



# విన్' రైజర్స్ అవుతుందా!

**ఐపీఎల్‌లో రెండో టైటిల్ కోసం 'ఆరెంజ్ ఆర్మీ' రెడీ**
**ఇషాన్ కిషన్ సారథ్యంలో బరిలోకి**
**అభిషేక్ శర్మ, హెడ్‌పై భారీ ఆశలు**
**కమిన్స్ గైర్హాజరీలో బౌలింగ్ దళం బలహీనం**



ఒకప్పుడు సన్‌రైజర్స్ హైదరాబాద్ అంటే... బలమైన బౌలింగ్ దళానికి చిరునామాగా నిలిచేది! ప్రత్యర్థి ముందు స్వల్ప లక్ష్యాలను నిర్దేశించినా... పకడ్బందీ బౌలింగ్‌తో వాటిని కాపాడుకుంటూ సత్తా చాటేది! కానీ 2024 సీజన్ నుంచి జట్టు దృక్పథం పూర్తిగా మారిపోయింది. గత రెండేళ్లుగా రైజర్స్ 'తూ మార్... మై మార్' ప్లాన్‌తో దుమ్మురేపుతోంది. ఐపీఎల్‌లో అత్యధిక స్కోర్లలో తొలి నాలుగింటిని ఈ రెండు సీజన్‌లలోనే తమ పేరిట లిఖించుకుందంటే రైజర్స్ ఊచకోత ఏ స్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు.

అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, లివింగ్‌స్టోన్, నితీశ్ కుమార్ రెడ్డి ఇలా బ్యాటింగ్ ఆర్డర్ మొత్తం హిట్టర్‌లతో నిండి ఉంది. ఆరంభ మ్యాచ్‌లకు కమిన్స్ లేకపోవడంతో బౌలింగ్ మరింత బలహీనపడగా... ఈ సీజన్‌లో ఇషాన్ కిషన్ జట్టును ఎలా నడిపిస్తాడనేది వేచి చూడాలి. విజృంభణ, విధ్వంసం, ఊచకోత... ఇవి గత రెండేళ్లుగా సన్‌రైజర్స్ బ్యాటింగ్ సాగిన తీరుకు పర్యాయపదాలు. ఒరిలోకి దిగింది మొదలు... చివరి బంతి వరకు ఒకటే బాదుడు! 'యాభై పరుగులకే ఆరు వికెట్లు పడ్డా... ఏడో బ్యాటర్ కూడా ధాటిగా ఆడే క్రమంలోనే వెనుదిరగాలి తప్ప... డిఫెన్స్ ఆడుతూ దొరికిపోకూడదు' అనే కమిన్స్ మంత్రాన్ని పాటిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్... ఈ రెండేళ్లలో లెక్కకు మిక్కిలి రికార్డులు తిరగరాసింది.

అయితే బ్యాటింగ్‌లో దూకుడు ఉన్నా... బౌలింగ్‌లో నాణ్యత లేక రైజర్స్ వెనుకబడి పోయింది. 2013లో లీగ్‌లోకి అడుగుపెట్టిన సన్‌రైజర్స్... 2016లో డేవిడ్ వార్నర్ సారథ్యంలో తొలిసారి ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత మరో రెండుసార్లు (2018, 2024లో) ఫైనల్‌కు చేరినా... రన్నరప్‌తోనే సరిపెట్టుకుంది.

ఇప్పటికే బలహీనంగా ఉన్న సన్‌రైజర్స్ బౌలింగ్ విభాగం... రెగ్యులర్ కెప్టెన్ కమిన్స్‌గైర్హాజరీతో మరింత డీలా పడింది. గత ఏడాది లీగ్ దశలో ఆడిన 14 మ్యాచ్‌ల్లో 6 విజయాలతో 6వ స్థానంలో నిలిచిన రైజర్స్... ఈసారి ట్రోఫీ చేజిక్కించుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది.

**బ్యాటింగ్‌పైనే భారం...**

ఐపీఎల్‌లోని అన్ని జట్లలో విధ్వంసకర బ్యాటింగ్ లైనప్ ఉన్న జట్టు ఏదంటే సన్‌రైజర్స్ అనే చెప్పాలి. ఓపెనింగ్ నుంచి ఎనిమిదో స్థానం వరకు దూకుడుగా బ్యాటింగ్ చేయగల ఆటగాళ్లు రైజర్స్ టీమ్‌కు సొంతం. క్షణాల్లో ప్రత్యర్థి నుంచి మ్యాచ్‌ను లాగేసుకోవడంలో ఓపెనర్లు అభిషేక్, హెడ్ సిద్ధహస్తులు. ఇషాన్ ధాటి ఏపాటిదో ఇటీవల టి20 ప్రపంచకప్‌లో అందరూ చూశారు.

తాత్కాలిక సారథిగానూ అతడిపై అదనపు బాధ్యతలు ఉన్నాయి. క్లాసెన్, లివింగ్‌స్టోన్, నితీశ్ కుమార్ రెడ్డితో మిడిలార్డర్ దుర్భేద్యంగా ఉంది. ఈ బ్యాటింగ్ లైనప్ కలిసికట్టుగా కదంతొక్కితే... ఎలాంటి బౌలింగ్ అయినా కకావికలం కావాల్సిందే. ఇప్పటికే హిట్టర్లతో దట్టంగా ఉన్న రైజర్స్... ఈ ఏడాది మినీ వేలంలో రూ. 13 కోట్లు పెట్టి ఇంగ్లండ్ ప్లేయర్ లివింగ్‌స్టోన్‌ను తీసుకుంది. కమిన్స్ లేకపోవడంతో అతడికి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలున్నాయి. 3 కోట్లు పెట్టి కొనుగోలు చేసుకున్న ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ గాయం కారణంగా సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి అటు బ్యాటింగ్‌లో, ఇటు బౌలింగ్‌లో మరింత ప్రభావం చూపాలని మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. మంచినీళ్ల ప్రాయంలా భారీ స్కోర్లు చేస్తున్నా... రైజర్స్ నిలకడగా విజయాలు సాధించలేకపోవడానికి కారణం బలహీన బౌలింగ్. జట్టుకు అవసరమైనప్పుడు వికెట్ తీసే స్ట్రయిక్ బౌలర్ లేకపోవడం అతిపెద్ద ప్రతికూలాంశం. ఉన్న ఒక్క టీమిండియా పేసర్ మొహమ్మద్ షమీని సైతం జట్టు వదిలేసుకుంది. దీంతో జైదేవ్ ఉనాద్కట్, హర్షల్ పటేల్‌లపై అదనపు భారం పడనుంది.

ఆరంభ మ్యాచ్‌ల్లో విదేశీ ప్లేయర్‌ల కోటాలో హెడ్, క్లాసెన్, లివింగ్‌స్టోన్, బ్రైడన్ కార్స్ చోటు దక్కించుకోవచ్చు. ఒక్క పేరున్న స్పిన్నర్ కూడా జట్టులో లేడు. ప్రఫుల్, అమిత్, ఓంకార్, సాకిబ్ హుస్సేన్, శివాంగ్‌ను వేలంలో తీసుకున్నా వారికి మ్యాచ్ దక్కే అవకాశాలు తక్కువే. సలీల్ అరోరా, శివమ్ మావి ఏమాత్రం ఆకట్టుకుంటారో చూడాలి.

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు: ఇషాన్ కిషన్ (కెప్టెన్), అనికేత్ వర్మ, స్మరణ్ రవిచంద్రన్, సలీల్ అరోరా, క్లాసెన్, హెడ్, హర్షల్ పటేల్, కమిందు మెండిస్, హర్ఈ?ష దూబే, కార్స్, శివాంగ్, క్రెయిన్స్ ఫులెట్రా, లివింగ్‌స్టోన్, డేవిడ్ పైన్, అభిషేక్ శర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, కమిన్స్, జీషాన్ అన్సారీ, జైదేవ్ ఉనాద్కట్, ఇషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్, ఓంకార్, అమిత్, ప్రఫుల్, శివమ్ మావి.

# స్పోర్ట్స్

## హైదరాబాద్‌లో టీమిండియా రెండు మ్యాచ్‌లు

**స్వదేశంలో భారత క్రికెట్ జట్టు 2026--2027 సీజన్ షెడ్యూల్ విడుదల**
**భారత్‌లో పర్యటించనున్న వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా**
**1979 తర్వాత సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో టీమిండియా ఐదు టెస్టుల సిరీస్**




**న్యూఢిల్లీ:** భారత పురుషుల క్రికెట్ జట్టు 2026--2027 సీజన్‌లో హైదరాబాద్ వేదికగా రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ ఏడాది అక్టోబర్ 14న ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో భారత్ టి20 మ్యాచ్ ఆడనుండగా ... వచ్చే ఏడాది జనవరి 6న జింబాబ్వేతో వన్డే మ్యాచ్ జరగనుంది. ఈ మేరకు 2026--27 సీజన్‌లో స్వదేశంలో టీమిండియా ఆడనున్న సిరీస్‌ల షెడ్యూల్‌ను బీసీసీఐ గురువారం విడుదల చేసింది. మొత్తం 17 వేదికల్లో 22 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల 'బోర్డర్--గావస్కర్' టెస్టు సిరీస్ సైతం ఉంది. 1979లో చివరిసారిగా భారత్, ఆస్ట్రేలియా మధ్య భారత్‌లో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరగగా... మళ్లీ ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఇరు జట్లు మన దేశంలో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఆడనున్నాయి. ఇక గతేడాది చివర్లో దక్షిణాఫ్రికాతో టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చిన గువాహటి మైదానానికి... ఈ సిరీస్‌లో మరో టెస్టు మ్యాచ్ దక్కడం చర్చనీయాంశంగా మారింది. భారత్--ఆస్ట్రేలియా మధ్య వచ్చే ఏడాది జనవరి 21 నుంచి ప్రతిష్టాత్మక 'బోర్డర్ --గావస్కర్' టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌కు నాగ్‌పూర్ ఆతిథ్యమిస్తుండగా... ఆ తర్వాత వరుసగా చెన్నై (జనవరి 29--ఫిబ్రవరి 2), గువాహటి (ఫిబ్రవరి 11--15), రాంచీ (ఫిబ్రవరి 19--23), అహ్మదాబాద్ (ఫిబ్రవరి 27--మార్చి 3)లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ జాబితాలో ముంబై, కోల్‌కతా లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ఈ సీజన్‌లో స్వదేశంలో ఆడనున్న 22 మ్యాచ్‌ల్లో 5 టెస్టులు కాగా... 9 వన్డేలు, 8 టి20లు ఉన్నాయి. టెస్టు, టి20 ఫార్మాట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ... ఈ సీజన్‌లో స్వదేశంలో తొమ్మిది వన్డేల్లో అభిమానులను అలరించనున్నారు. వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వేతో టీమిండియా వన్డే సిరీస్‌లు ఆడనుంది. జింబాబ్వే జట్టు చివరిసారిగా 2002లో భారత్‌లో పర్యటించింది.




## రామ్ చరణ్ బర్త్ డే స్పెషల్.. టీజర్ రిలీజ్ టైమ్ ఫిక్స్..!

రామ్ చరణ్– బుచ్చిబాబు కాంబోలో వస్తోన్న మోస్ట్ అవైటేడ్ మూవీ పెద్ది. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా వస్తోన్న ఈ సినిమా కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఒక్క రోజు ముందే రామ్ చరణ్ ఎడమ కన్నుకు చిన్న గాయం కావడంతో కాస్తా గ్యాప్ ఇచ్చారు. మార్చి 27న రామ్ చరణ్ బర్త్ డే అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు తాజాగా పెద్ది మూవీ టీమ్ అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పింది. రేపు ఉదయం 9 గంటల 45 నిమిషాలకు అప్‌డేట్ రానుందని ప్రకటించారు. ఇక ఒక్క రోజు మాత్రమే మిగిలి ఉంది..ఇప్పటిదాకా బ్యాట్ పట్టుకుని అతన్ని చూశారు కదా.. ఇప్పుడు గదతో విరుచుకుపడబోతున్నాడు.. రేపు (మార్చి 27) ఉదయం 9:45 గంటలకు అతను రణరంగంలోకి అడుగుపెట్టబోతున్నాడు అంటూ గదతో ఉన్న ఫోటోను షేర్ చేసింది. చెర్రీ పుట్టినరోజు కానుకగా పెద్ది టీజర్ రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## మాస్ ప్లాన్‌లో రామ్.. లోకేష్ అసిస్టెంట్‌తో మూవీ



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ఇటీవల 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా విడుదలై చాలా రోజులు గడిచినప్పటికీ, ఆయన తదుపరి చిత్రంపై అధికారిక ప్రకటన మాత్రం ఇప్పటివరకు వెలువడలేదు.దీంతో రామ్ నెక్స్ట్ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. గత కొంతకాలంగా రామ్ ఓ హర్రర్ థ్రిల్లర్ జానర్‌లో సినిమా చేయడానికి ఆసక్తి చూపుతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన తదుపరి సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, కోలీవుడ్ స్టార్ దర్శకుడు లోకేష్ కనకరాజ్ వద్ద అసోసియేట్‌గా దాదాపు మూడు నుంచి నాలుగు చిత్రాలకు పనిచేసిన లోగి విఘ్నేష్ దర్శకత్వంలో రామ్ తన తదుపరి చిత్రం చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ ఇద్దరి మధ్య కథా చర్చలు పూర్తయ్యాయని, దర్శకుడు విఘ్నేష్ వినిపించిన కథ రామ్‌కు నచ్చడంతో ఆయన ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయని, మిగతా నటీనటులు మరియు టెక్నీషియన్ల వివరాలు కూడా త్వరలో వెల్లడయ్యే అవకాశముందని తెలుస్తుంది.



## మ్యూజికల్ లవ్ స్టోరీతో రాబోతున్న అనన్య పాండే

బాలీవుడ్ యంగ్ బ్యూటీ అనన్య పాండే, నటుడు లక్ష్య జంటగా నటిస్తున్న సరికొత్త మ్యూజికల్ లవ్ స్టోరీ 'చాంద్ మేరా దిల్'. వివేక్ సోనీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. మే 22న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు ప్రకటిస్తూ మేకర్స్ ఒక ఆసక్తికరమైన పోస్టర్‌ను వదిలారు. ఈ సినిమా పోస్టర్‌పై ఉన్న "ప్రేమ కాస్త పిచ్చివాళ్లను చేస్తుంది.. మీకు తెలుసా?" అనే క్యాప్షన్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం మామూలు ప్రేమకథలా కాకుండా, ప్రేమలో ఉండే ఆ గాఢతను, ఆ పిచ్చిని ఇందులో చాలా లోతుగా చూపించబోతున్నారని ఈ క్యాప్షన్ ద్వారా అర్థమవుతోంది. అనన్య, లక్ష్య ఒకరి చేతులు ఒకరు పట్టుకుని, ఎంతో ఎమోషనల్‌గా దగ్గరగా కూర్చున్న తీరు ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. ఈ పోస్టర్‌లో మరో హైలైట్ ఏమిటంటే, ఆ జంట వెనుక ఉన్న బుద్ధ విగ్రహం. బుద్ధుని సాక్షిగా సాగే ఈ ప్రేమ ప్రయాణం ఎలాంటి మలుపులు తిరుగుతుందో అని నెటిజన్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ధర్మ ప్రొడక్షన్స్ అంటేనే మంచి సంగీతం, విజువల్స్‌కు కేరాఫ్ అడ్రస్. అదే స్థాయిలో ఈ మ్యూజికల్ లవ్ స్టోరీని మే 22న సమ్మర్ కానుకగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు. అనన్య పాండే తన గ్లామర్‌తో, లక్ష్య తన నటనతో ఈ సినిమాలో మ్యాజిక్ చేయబోతున్నారని తెలుస్తోంది.



## మరోసారి 'సితార'లో నితిన్?

ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యంత డేంజర్ జోన్‌లో కెరీర్‌ను కొనసాగిస్తున్న హీరోల్లో నితిన్ ఒకరిగా కనిపిస్తున్నారు. ఈయనకు ఆఖరుగా 2020లో విడుదలైన 'భీష్మ' చిత్రంతో మంచి విజయం దక్కింది.ఆ తర్వాత నుండి ఆయన నటించిన పలు చిత్రాలు బాక్స్ ఆఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో, నితిన్ తదుపరి సినిమాలపై ఆసక్తి నెలకొంది. నితిన్‌కు బాగా కలిసి వచ్చిన నిర్మాణ సంస్థల్లో సీతారా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ ముందు వరుసలో ఉంటుంది. ఈ బ్యానర్‌లో ఆయన ఇప్పటికే 'భీష్మ', 'రంగ్ దే' వంటి చిత్రాలు చేసి ప్రేక్షకులను అలరించారు. తాజాగా ముచ్చటగా మూడోసారి ఈ బ్యానర్‌లోనే నితిన్ సినిమా చేయబోతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ ప్రాజెక్ట్‌ను ఓ కొత్త దర్శకుడు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన కథ దాదాపు పూర్తయినట్లు, మరికొన్ని రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, నితిన్ వి.ఐ. ఆనంద్ దర్శకత్వంలో ఓ సైన్స్ ఫిక్షన్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ మూవీపై అభిమానుల్లో మంచి ఆసక్తి నెలకొంది. అలాగే 'ఆయ్' చిత్ర దర్శకుడు అంజి కె మణిపుత్రతో కూడా ఓ సినిమా చేసే ఆలోచనలో ఉన్నట్లు టాలీవుడ్ వర్గాల్లో ఓ టాక్ నడుస్తుంది.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463